నేడు మంత్రి లోకేశ్ రాక

▸▸ సీఐఐ సదస్సుకు హాజరు

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ బుధవారం నగరానికి రానున్నారు. ఆయన ఉదయం ఎనిమిది గంటలకు విజయవాడ నుంచి విమానంలో బయలుదేరి 8.50 గంటలకు విశాఖపట్నం వస్తారు. విమానాశ్రయం నుంచి నేరుగా నోవాటెల్ హోటల్‌కు చేరుకుని సీఐఐ సదస్సుకు హాజరవుతారు. మధ్యాహ్నం మూడు గంటల వరకూ అక్కడే ఉంటారు. అనంతరం మధురవాడ వెళ్లి అదానీ గ్రూపునకు డేటా సెంటర్ ఏర్పాటునిమిత్తం కేటాయించిన కొండను సందర్శిస్తారు. సాయంత్రం 4.45 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 5.20 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకుని నాయకులు, కార్యకర్తలను కలుస్తారు. కాగా ఈనెల 26వ తేదీన కూడా లోకేశ్ పలు కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంది. అయితే దీనికి సంబంధించి అధికారికంగా ఎటువంటి సమాచారం రాలేదు. మంత్రి లోకేశ్ మంగళవారం రాత్రికి నగరానికి రావల్సి ఉంది. అయితే విజయవాడలో పలు కార్యక్రమాల్లో బిజీగా ఉన్నందున ఆయన రాక బుధవారానికి వాయిదా పడింది.



ఏపీఎంఎస్ఎంఈడీసీ చైర్మన్‌గా శివశంకర్

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల పంపిణీ ప్రారంభించింది. రాష్ట్ర మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఎంఈడీసీ) చైర్మన్‌గా జనసేన పార్టీ అధికార ప్రతినిధి తమ్మిరెడ్డి శివశంకర్‌ను నియమించింది. జనసేన నుంచి ముగ్గురికి చైర్మన్ పదవులు లభించాయి. అందులో శివశంకర్ ఒకరు. ఆయన వాణిజ్య పన్నుల శాఖలో ఉన్నతాధికారిగా పనిచేస్తూ ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి జనసేనలో చేరారు. గత ఎన్నికల్లో అనకాపల్లి నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పెందుర్తి సీటు ఆశించారు. అయితే అవకాశం దక్కలేదు.. ప్రస్తుతం పార్టీ ప్రధాన కార్యాలయంలో కీలకంగా వ్యవహరిస్తున్న శివశంకర్‌ను ఏపీఎంఎస్ఎంఈడీసీ చైర్మన్‌గా నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే కాగా రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ... మిగతా 6వ పేజీలో



తమ్మిరెడ్డి శివశంకర్



మేయర్ పోడియం ముందు బైఠాయించిన కూటమి కార్పొరేటర్లు

మహా రచ్చ

మేయర్‌కు ముడుపులు ముట్టాయని ఆరోపణలు | **రాజీనామాకు కూటమి సభ్యుల పట్టు**

- ▸▸ కరోనా నుంచి ఇప్పటివరకూ యూసీడీలో రూ.4.75 కోట్లు అవినీతి జరిగిందని ఆరోపణ
- ▸▸ దీనిపై అప్పటి మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి వైసీపీ కార్యాలయం పేరుతో ఫిర్యాదు
- ▸▸ విచారణ జరపాలంటూ ఆదేశం
- ▸▸ విచారణను నీరుగార్చేందుకు మేయర్, అప్పటి కమిషనర్‌కు లంచాలు ముట్టాయని అభియోగం
- ▸▸ జిల్లా కలెక్టర్‌తో విచారణ జరిపిస్తామన్న కమిషనర్ సంపత్‌కుమార్
- ▸▸ మేయర్ పదవిలో ఉంటే విచారణకు ఆటంకం కాబట్టి రాజీనామా చేయాలంటూ పోడియంను చుట్టుముట్టిన కూటమి కార్పొరేటర్లు
- ▸▸ ఉక్కిరిబిక్కిరి అయిన మేయర్, వైసీపీ కార్పొరేటర్లు
- ▸▸ సభను రేపటికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించి వెళ్లిపోయిన మేయర్

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ సర్వసభ్య సమావేశం మంగళవారం రసాభాసగా జరిగింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జీవీఎంసీలో రూ.4.75 కోట్ల అవినీతి జరిగిందని, ఈ వ్యవహారంలో ప్రస్తుత మేయర్‌పైనా అభియోగాలు ఉన్నందున ఆమె రాజీనామా చేయాలంటూ కూటమి సభ్యులు పట్టుబట్టారు. ఊహించని పరిణామంతో మేయర్ గొలగాని హరివెంకటకుమారి కంగుతిన్నారు. ఆమె ముఖకవళికలు ఒక్కసారిగా మారిపోయాయి. వైసీపీ సభ్యుల నుంచి కూడా ఆశించిన మద్దతు లభించకపోవడంతో ఏం సమాధానం చెప్పాలో తెలియని స్థితిలో పోడియం దిగి అర్ధంతరంగా తన ఛాంబర్‌కు వెళ్లిపోయారు. అయినప్పటికీ కూటమి సభ్యులు మేయర్ రాజీనామా చేయాలంటూ నినాదాలు కొనసాగించారు. కొద్దిసేపటి తర్వాత మేయర్ తిరిగి కౌన్సిల్‌హాలులోకి వచ్చి ఎజెండాను ప్రారంభించేందుకు యత్నించినప్పటికీ కూటమి సభ్యులు రాజీనామా చేయాలనే నినాదాలు చేయడంతో ఆమె సభను బుధవారానికి వాయిదావేస్తూ పోడియం దిగి వెళ్లిపోయారు.

మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి కౌన్సిల్ సమావేశం కావడంతో వైసీపీకి చెందిన ... మిగతా 6వ పేజీలో

కూటమి X వైసీపీ

▸▸ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ అంశం, ఫుడ్‌కోర్టు, ఆస్తి పన్ను సహా పలు అంశాలపై వాగ్వాదం

▸▸ పోడియం వద్ద ప్లకార్డులతో నినాదాలు

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో పలుమార్లు కూటమి, వైసీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. ఇరుపక్షాలు పోటాపోటీగా పోడియం ఎదుట ఆందోళనకు దిగాయి. సమావేశం ప్రారంభమైన వెంటనే ఎజెండాలో అంశాలపై చర్చతో సభను ప్రారంభిస్తున్నట్టు మేయర్ ప్రకటించగా, కూటమి కార్పొరేటర్లతోపాటు సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు.

తొమ్మిది నెలలు తర్వాత జరుగుతున్న సమావేశం కావడంతో వార్డుల్లోని సమస్యలపై చర్చించేందుకు జీరో అవర్ ఇవ్వాలని మేయర్ పోడియాన్ని చుట్టుముట్టారు. అదే సమయంలో వైసీపీ కార్పొరేటర్లు ప్లకార్డులు పట్టుకుని మేయర్ పోడియం వద్దకు వచ్చారు. అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుతోపాటు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీలను సస్పెండ్ చేయడంతోపాటు వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టాలంటూ నినాదాలు చేయడంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు మైక్ పట్టుకుని సభను సజావుగా నడిపేందుకు సహకరించాలంటూ కోరడంతో జనసేన ఫ్లోర్‌లీడర్ భీశెట్టి వసంత లక్ష్మి మేయర్ కాకుండా వేరొకరు మైక్ పట్టుకుని మాట్లాడడం ఏమిటని అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. అనంతరం స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయడంతోపాటు ఆస్తి పన్ను తగ్గింపు, చెత్తపై యూజర్ చార్జీలు రద్దు అంశాలపై వైసీపీ, సీపీఐ, సీపీఎం ఇచ్చిన ప్రతిపాదనలను ... మిగతా 6వ పేజీలో



కూటమి, వైసీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం

వీధి దీపాలు వెలగడం లేదు

▸▸ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

కౌన్సిల్ సమావేశంలో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ నగరంలో వీధి దీపాలు వెలగడం లేదని, రాత్రివేళ అంధకారం రాజ్యమేలుతోందన్నారు. చీకట్లో దోపిడీలు, దొంగతనాలు, అరాచకాలు, గంజాయి బ్యాచ్ ఆగడాలు పెరిగిపోయాయన్నారు. బీచ్‌రోడ్డులో కూడా లైటింగ్ సరిపడినంతగా ఉండడం లేదని, దీనివల్ల పర్యాటకులు సైతం అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా విద్యుత్ దీపాల వ్యవస్థను సరిచేయడంతోపాటు వీధికుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించే ప్రయత్నం చేయాలని కోరారు. దీనికి కమిషనర్ సంపత్‌కుమార్ సమాధానం ఇస్తూ బీచ్‌రోడ్డులో ఉన్న లైట్ల సామర్థ్యం తక్కువగా ఉందని, నగరంలో చాలాచోట్ల లైట్లు వెలగడం లేదని గుర్తించానన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఐదుసార్లు సమీక్షలు నిర్వహించానని, సంబంధిత కాంట్రాక్టర్‌కు ఒక నోటీసు ఇచ్చామన్నారు. త్వరలోనే రెండో నోటీసు ఇచ్చి పరిస్థితి మారకపోతే టెండర్‌ను చట్టబద్ధంగా రద్దు చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

▸▸ మరొకరికి గాయాలు

▸▸ తాటిచెట్లపాలెం జంక్షన్ సమీపంలో డివైడర్‌ను ఢీకొన్నబైక్



ప్రవీణ్ (ఫైల్)



ప్రశాంత్

కంచరపాలెం, సెప్టెంబరు 24 : జాతీయ రహదారిపై తాటిచెట్లపాలెం జంక్షన్ సమీపంలో మంగళవారం ఉదయం ఆరు గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. సీతంపేట ప్రాంతానికి చెందిన ప్రవీణ్ (24), దొండపర్తికి చెందిన ప్రశాంత్ (22), కంచరపాలేనికి చెందిన మహేష్ (20) స్నేహితులు. వీరు ముగ్గురూ ఉదయం స్థానిక ఊర్వశి జంక్షన్ నుంచి ద్విచక్ర వాహనంపై తాటిచెట్లపాలెం వైపు బయలుదేరారు. తాటిచెట్లపాలెం జంక్షన్‌కు కొద్దిగా ముందు సంజీవయ్య నగర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న ప్రవీణ్ (24), మధ్యలో కూర్చున్న ప్రశాంత్ (22) అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక కూర్చున్న మహేష్(20)కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరధి ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించారు. సీఐ దాశరధి నేతృత్వంలో ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులను ట్రైన్ ఎక్కించి...

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ప్రవీణ్ రిటైర్డు ఆర్మీ ఉద్యోగి లక్ష్మణరావు కుమారుడు. వీరు సీతంపేట గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఊరు వెళుతున్న తల్లితండ్రిని ప్రవీణ్ ట్రైన్ ఎక్కించి, దొండపర్తిలో నివాసం ఉంటున్న స్నేహితుడు ప్రశాంత్‌ను తన బైక్‌పై తీసుకుని కంచరపాలెంలో ఉంటున్న మహేష్ వద్దకు వచ్చాడు. అక్కడ నుంచి ... మిగతా 6వ పేజీలో

అప్పన్న సన్నిధిలో శాంతి హోమం

▸▸ దోష నివృత్తికి చర్యలు

▸▸ మహా సంప్రోక్షణ కూడా...

సింహాచలం, సెప్టెంబరు 24: రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో ప్రసాదాల తయారీలో చోటుచేసుకున్న దోషాల నివృత్తికి తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం సింహాచలంలోని వరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో శాంతిహోమం నిర్వహించారు. ప్రభాత ఆరాధనల అనంతరం సుదర్శన పెరుమాళ్‌ను ప్రత్యేక మండపంలో యజ్ఞమూర్తిగా అధిష్ఠింపజేశారు. వైదికులు లోక కల్యాణం, దోష పరిహారార్థం బింబారాధన, మండపారాధన, కలశారాధన చేశారు. ఆలయ పోటు నుంచి తెచ్చిన వృద్ధాగ్నిని హోమగుండంలో వేసి అగ్ని ప్రతిష్ఠాపన గావించారు. పంచసూక్తాలు, నారసింహ, సుదర్శన, మూల, మూర్తి మంత్రాలతో ... మిగతా 6వ పేజీలో



సింహాచలం దేవస్థానంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న రుత్వికులు

కొత్త జిల్లాలకు సూపరింటెండెంట్ ఇంజనీర్లు

▸▸ ఏపీఈపీడీసీఎల్ ఉత్తర్వులు

▸▸ అనకాపల్లి జిల్లా సర్కిల్ ఎస్ఈగా గొప్పు ప్రసాద్, అల్లూరి సీతారామరాజు సర్కిల్ ఎస్ఈగా జీఎస్ ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాలకు సూపరింటెండెంట్ ఇంజనీర్ల (ఎస్ఈ)ను నియమిస్తూ ఏపీఈపీడీసీఎల్ ఉత్తర్వులు జారీచేసింది. కొత్త జిల్లాల్లో కలెక్టరేట్ సహా, ఇతర శాఖలకు ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటైనప్పటికీ విద్యుత్ పంపిణీ సంస్థలు మాత్రం ఉమ్మడి జిల్లా కేంద్రంగానే ఇన్నాళ్లూ కార్యకలాపాలు నిర్వహించాయి. జిల్లా కలెక్టర్లు సమావేశాలు నిర్వహించినప్పుడు ఒక ఎస్ఈనే ఆ జిల్లాకు, ఈ జిల్లాకు తిరగడం ఇబ్బందిగా మారడంతో తప్పనిసరిగా ఎస్ఈలను నియమించాలని నిర్ణయించారు.ప్రస్తుతం ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పించడంతో అందుబాటులోఉన్నవారినే కొత్త జిల్లాలకు ఎస్ఈలుగా నియమించారు. వారికి సహాయంగా ఒక డిప్యూటీ ఇంజనీర్ (టెక్నికల్), ఇద్దరు ఏఈలు, ఇద్దరు జూనియర్ ఇంజనీర్లు, అకౌంటింగ్ అధికారులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను ఇచ్చారు. ఇలా మొత్తం 12 మందితో సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అనకాపల్లి జిల్లా సర్కిల్ ఎస్ఈగా గొప్పు ప్రసాద్, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ సర్కిల్ ఎస్ఈగా ఎస్.రాజాబాబు, పార్వతీపురం మన్యం సర్కిల్ ఎస్ఈగా కె.చలపతిరావు, అల్లూరి సీతారామరాజు సర్కిల్ ఎస్ఈగా జీఎస్ ప్రసాద్, కాకినాడ ఎస్ఈగా గొర్లె ప్రసాద్‌లను నియమించారు.

డిప్యుటేషన్‌కు ఉక్కు ఉద్యోగులు విముఖం

విశాఖ స్టీల్‌ప్లాంటు నుంచి వంద మందిని నగర్‌నార్ ప్లాంటుకు పంపాల్సిందిగా ఉక్కు మంత్రిత్వ శాఖ ఆదేశాలు

▸▸ రెండు రోజులుగా ఇంటర్వ్యూలు

▸▸ 30 మంది మాత్రమే హాజరు

▸▸ సరైన స్పష్టత లేకపోవడమే కారణం

▸▸ ఆ ప్లాంటును కూడా ప్రైవేటీకరిస్తే తమ పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు



విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని నగర్‌నార్ స్టీల్‌ప్లాంటుకు డిప్యుటేషన్‌పై వెళ్లడానికి విశాఖ ఉక్కు ఉద్యోగులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో ఉత్పత్తి తక్కువగా జరుగుతోందని, ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని భావిస్తున్న కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఇక్కడి నుంచి నగర్‌నార్‌కు వంద మందిని డిప్యుటేషన్‌పై పంపాలని నిర్ణయించింది. దీని కోసం ఈ నెల 23, 24, 25 తేదీల్లో విశాఖలోనే ఇంటర్వ్యూలు ఏర్పాటుచేసింది. ఆసక్తి కలిగినవారు హాజరు కావాలని కోరింది. వందల సంఖ్యలో వస్తారని ఏర్పాట్లు చేశారు. కానీ సోమ, మంగళవారాల్లో కేవలం 30 మంది మాత్రమే ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఇంకా బుధవారం ఒక్కరోజే మిగిలి ఉంది. మరో 70 మంది అవసరం. అంతమంది వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. డిప్యుటేషన్‌పై నగర్‌నార్ వెళితే కలిగే ప్రయోజనాలు ఏమిటో అధికారులు వెల్లడించడం లేదు. ఎవరైనా వెళితే అక్కడ ఉండడానికి షేరింగ్ రూమ్ ఇస్తామని ముందు ప్రకటించారు. సోమ, మంగళవారాల్లో ఇంటర్వ్యూలకు తక్కువ సంఖ్యలో ఉద్యోగులు హాజరు కావడం చూసి, మంగళవారం సాయంత్రం కొత్త సర్క్యులర్ జారీచేశారు. ఏ ఉద్యోగి అయినా కుటుంబంతో వస్తే క్వార్టర్ ఇస్తామని, సింగిల్‌గా వస్తే షేరింగ్ రూమ్ ఇస్తామని పేర్కొన్నారు. అయితే నగర్‌నార్ స్టీల్‌ప్లాంటు నిర్వహణ బాధ్యతలు ప్రస్తుతం ఎన్ఎండీసీ చూడడం లేదు. ఆ సంస్థకు ఖనిజాలు తవ్వి టోకున విక్రయించడం తప్ప స్టీల్ తయారీలో అనుభవం లేదు. దాంతో నగర్‌నార్ ప్లాంటు నిర్వహణ బాధ్యతలను మెకాన్ సంస్థకు అప్పగించింది. ఆ ఒప్పందం గడువు త్వరలో ముగియనుంది. ఆ తరువాత ఎవరికి ఇస్తారనే దానిపై స్పష్టత లేదు. సరైన సంస్థ ముందుకు రాకపోతే అప్పుడు ఆ ప్లాంటును ప్రైవేటుకు ఇచ్చేస్తే తమ పరిస్థితి ఏమిటంటూ స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. దానికి ఎన్ఎండీసీ అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారు. తమను ఇంటర్వ్యూ మాత్రమే చేయమన్నారని, మిగిలిన విషయాలు తమకు తెలియవని అంటున్నారు. నగర్‌నార్ కూడా ప్రభుత్వ సంస్థేనని, దానిని కూడా ప్రైవేటుకు అప్పగిస్తే తమ సంగతి ఏమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సమస్య రాకుండా ప్రస్తుతం మెకాన్ ఆ ప్లాంటును నిర్వహిస్తున్నందున ఆ గడువు ముగిసిన వెంటనే, ఆ బాధ్యతను విశాఖ స్టీల్ ప్లాంటుకు అప్పగిస్తే చక్కగా నిర్వహిస్తుందని, ప్రతిఫలంగా ఇక్కడికి అవసరమైన ఐరన్‌ఓర్‌ను సక్రమంగా సరఫరా చేస్తే రెండింటినీ నడుపుకోవచ్చునని అధికారుల సంఘం సూచిస్తోంది. దీనిపై కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ దృష్టి పెట్టాలని కోరుతోంది.

2న బ్యాడ్మింటన్ టోర్నమెంట్



పోస్టర్ విడుదల చేస్తున్న రోటరీ ప్రతినిధులు

సీతంపేట, సెప్టెంబరు 24: అక్టోబరు 2వ తేదీన గాంధీ జయంతి పురస్కరించుకుని రోటరీక్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్టు క్లబ్ ప్రెసిడెంట్ ఎండీ యాసిన్ బాబా తెలిపారు. ద్వారకానగర్‌లోని రోటరీ క్లబ్ అధ్యక్షుడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ పోస్టర్‌ని క్లబ్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులు, మహిళలు డబుల్స్ విభాగాలు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. అనకాపల్లి నుంచి ఇచ్ఛాపురం వరకు 22 రోటరీక్లబ్‌లకు చెందిన 48 టీమ్‌లు పాల్గొననున్నట్టు తెలిపారు. విశాఖ రైల్వే ఇండోర్ స్టేడియంలో ఈ టోర్నీ జరుగుతుందన్నారు. ఆసక్తి గల రోటరీ సభ్యులు తమ పేర్లను ఈ నెల 28వ తేదీలోగా రిజిస్ట్రర్ చేయించుకోవాలని సూచించారు. వివరాలకు డాక్టర్ అశోక్ ఫోన్: 9866346347ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ చింతా నేతాజీ, క్లబ్ వైస్ ప్రెసిడెంట్ బి.భాస్కరరావు, రోటరీ సభ్యులు కేఎంకే రమేశ్, సూర్యతేజ, క్లబ్ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ బి.బ్రహ్మానందం పాల్గొన్నారు.

వరద బాధితులకు టీడీపీ లీగల్ సెల్ ఆర్థిక సాయం



శ్రీ భరత్‌కు చెక్కును అందజేస్తున్న ప్రతినిధులు

మహారాణిపేట, సెప్టెంబరు 24: తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు రూ. 2,71,116 లక్షలు విరాళంగా అందించారు. టీడీపీపై సానుభూతి గల న్యాయవాదుల సహకారంతో సేకరించిన ఈ మొత్తాన్ని మంగళవారం ఎంపీ శ్రీభరత్, జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ, కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్‌లకుఅందజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ నాయకులు బత్తి రాజశేఖర్, ఎస్.వి. రమణ, ఎస్. సతీష్ కుమార్, గొంపా సత్యనారాయణ, బి. ఉమాశంకర్, కె. అప్పలనాయుడు, డి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రామకృష్ణానగర్‌లో రక్తదాన శిబిరం



రక్తదాతలతో జనసేన నేత ఉషాకిరణ్

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 24 : గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్‌లో శ్రీ సంపత్ సాయి ఉత్సవ, సేవా కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. యువకులు రక్తదానం చేసి విశాఖ బ్లడ్ సెంటర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత బండి కన్నా తదితరులు పాల్గొన్నారు.

సినీ ఏజెంట్ వాసు మృతి

అకయ్యపాలెం, సెప్టెంబరు 24 : సినీ ఏజెంట్ వాసుపల్లి వాసు మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వాసు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచారు. దీంతో అయన పార్థివ దేహన్ని కొబ్బరితోటలోని స్వగృహానికి తీసుకువెళ్లారు. వాసు జూనియర్ ఆర్టిస్ట్‌గా, జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ కోశాధికారిగా విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారు. ఆయన మృతికి హైదరాబాద్, విశాఖ సినీ మేనేజర్లు, ఏజెంట్లు, జూనియర్ ఆర్టిస్టులు సంతాపం వ్యక్తం చేశారు.

కేజీహెచ్‌లో నిరుపయోగంగా బ్యాటరీ వాహనాలు

» రోగులకు ఇబ్బందులు

మహారాణిపేట, సెప్టెంబరు 24: కేజీహెచ్‌లో రోగులను ఒకచోట నుంచి మరో చోటుకు తరలించేందుకు ఉపయోగపడే పలు వాహనాలు షెడ్డుకే పరిమితం చేస్తున్నారు. దీంతో రోగులు, వృద్ధులు నడవలేని స్థితిలో ఉన్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోగులు ఒక విభాగం నుంచి మరో విభాగానికి, కొండ మీద ఉన్న సూపర్‌స్పెషాలిటీ వార్డులకు వెళ్లేందుకు గతంలో సమస్యలు ఎదుర్కొనేవారు. ఈ స్థితిలో ఆరు నెలల కిందట ఓ సంస్థ సీఎస్ఆర్ నిధులనుంచి అధునాతన ఆరు బ్యాటరీ వాహనాలను అందించింది. అవి రోగులను ఉచితంగా ఆసుపత్రిలో పలుచోట్లకు తరలింపులో ఎంతగానో ఉపయోగపడ్డాయి. అలాంటిది ఎలాంటి సాంకేతిక సమస్యలులేకుండా వినియోగంలోఉన్న ఆరు వాహనాల్లో ఐదింటిని ఆస్పత్రిలో ఓ మూలన షెడ్డుకు పరిమితం చేశారు. మంగళవారం ఉదయం రోగులతో అత్యంత రద్దీగా ఉన్న సమయంలో వాటిని వదిలేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తంచేశారు.గతంలో, ఇలాంటి వాహనాలు లేక రోగులు ఆసుపత్రిలో ఆటోలను ఆశ్రయించేవారు. ఒక వార్డునుంచి, సూపర్ స్పెషాలిటీ విభాగాలకు తీసుకువెళ్లేందుకు మనిషి వద్ద సుమారు రూ. 100 వసూలు చేసేవారు.ఈస్థితిలో రోగులకు సౌకర్యార్థం స్వచ్ఛంద సంస్థలు, దాతలు అందించిన వాహనాలను సరిగ్గా వినియోగించు కోలేకపోవటంపై విమర్శలు తలెత్తుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల అధిక సంఖ్యలో రోగులతో రద్దీగా ఉంటుంది. ఆ సమయంలో ఈ వాహనాల డ్రైవర్లకు ఒత్తిడిగా ఉంటుంది. ఈ సమయంలో వారు బాధ్యతలనుంచి తప్పించుకు తిరుగుతున్నట్టు సమాచారం. అధికారులు ఇకనైనా స్పందించి వాహనాలు సక్రమంగా వినియోగించేలా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



రోగులు వచ్చే సమయంలో షెడ్డులో ఉన్న బ్యాటరీ వాహనాలు

27న యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సమ్మె



నిరసనలో బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు

సీతమ్మధార, సెప్టెంబరు 24: సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు, అధికారుల సంఘం చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సంఘ నాయకులు కోరారు. సీతమ్మధార యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, బ్యాంక్‌లో ఖాళీ పోస్టుల భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పని ఒత్తిడిని తగ్గించాలని, అప్రెంటీస్ నియామకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులంతా ప్లకార్డులతో సమస్యలపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘ నాయకులు కె.రమేష్, రీజనల్ కార్యదర్శి ఆర్.వసంతరావు, సాగర్, శ్రీనివాస్, ప్రత్యూష, బ్యాంక్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు బజార్‌ల సెలవుపై ఆరా....

సీతమ్మధార, సెప్టెంబరు 22: సీతమ్మధారలోని రైతుబజార్‌లో మంగళవారం విచ్చేసిన రైతులు, వినియోగదారులతో జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖాధికారి యాసిన్ రైతుబజార్ సెలవుపై ఆరా తీశారు. రైతు బజారుకు వారాంతపు సెలవుపై అభిప్రాయాలను సేకరించారు. పలువురు రైతులు తమకు వారంలో ఒకరోజు సెలవు కావాలని అభి ప్రాయం వ్యక్తం చేశారు.



రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖాధికారి యాసిన్

ప్రైవేటు సంస్థలు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి: వంశీకృష్ణ

జగదాంబ కూడలి, సెప్టెంబరు 24: పేదల వైద్య సేవలందించేందుకు పోర్టు ట్రస్టు అనుబంధంగా ఉన్న ప్రైవేటు సంస్థలు ముందుకు రావాలని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం పాతపోస్టాఫీసు మత్స్యకార భవనంలో గీతం హాస్పిటల్స్ నేతృత్వంలో వేదాంత, వీజీసీబీలు పోర్టు సహకారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పేదలకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ సాధిక్, షిరీన్ రహమాన్, వేదాంత సీఈవో సతీశ్, కూటమి స్థానిక నాయకులు దానేష్, చిన్న, లడ్డూ, హీరా. అనిఫ్, కృష్ణ, కోటమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

రైల్వే బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీప్రారంభం

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 24: తూర్పు కోస్తా రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ వాల్తేరు డివిజన్ నిర్వహిస్తున్న అఖిల భారత రైల్వే 78వ పురుషుల, 17వ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. రైల్వే శ్రీనివాస కల్యాణ మండపం వద్ద డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ పోటీలను ప్రారంభించారు. టోర్నీలో రైల్వేలోని 14 జోన్ల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారని, సుమారు 121 మంది అంతర్జాతీయ బాక్సర్లు, అర్జున అవార్డు గ్రహీతలు ఉన్నారన్నారు. వాల్తేరు డివిజన్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్, ఉపాధ్యక్షులు మధుమిత సాహు, ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, స్పోర్ట్సు ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్ బి.అవినాష్, అసిస్టెంట్ స్పోర్ట్సు ఆఫీసర్ అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

తొలిరోజు ఫలితాలు: పురుషుల 51 కిలోల విభాగంలో అంకిత్ (పీఎల్‌డబ్ల్యు), కులదీప్ (ఎన్‌సీఆర్), ఆశిష్ ఇన్హా (ఎస్ఆర్), అజయ్ పెండోర్ (సీఆర్), 54 కిలోల విభాగంలో అనంత చోపదే (సీఆర్), అక్షయ్ కలోసియా (ఎన్‌డబ్ల్యుఆర్) గెలుపొందారు.

దేవదాయ శాఖ ఉప కమిషనర్‌కు సత్కారం

విశాఖపట్నం, సెప్టెంబరు 24: దేవదాయ ధర్మాదాయశాఖ జోన్ -1 ఇన్‌చార్జి ఉప కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్.సుజాతకు రెగ్యులర్ బాధ్యతలు అప్పగించడంతో అధికారులు మంగళవారం ఆమె కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. శ్రీకాకుళం జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ బలివాడ ప్రసాద్‌పట్నాయక్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు శ్యామలరావు, సర్వేశ్వరరావు, సహాయ కమిషనర్ కార్యాలయ ఉద్యోగి కోదండం, డిప్యూటీ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.మురళీమోహన్, ఈఓ శేఖరబాబు ఆమెను దుశ్శాలువతో సత్కరించారు.



సుజాతను సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

తాగునీటి సరఫరా ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు కల్పించాలి

సీతమ్మధార, సెప్టెంబరు 24: జీవీఎంసీలో తాగునీటి సరవరా విభాగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు తమ వేతనాలు పెంచాలని కోరుతూ, సీతమ్మధారలోని సంబంధిత కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. దీంతో పాటు పలువురు కార్పొరేటర్లను కలిసి వినతి పత్రాలను సమర్పించారు. తమకు వస్తున్న రూ.13 వేలతో జీవించలేక పోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్టర్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్నకార్మికులు

అక్కయ్యపాలెం: జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగంలోని అవుట్‌సోర్సింగ్ కార్మికులు సమస్యలపై 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ,44వ వార్డు కార్పొరేటర్ బాజాల శ్రీనివాసరావును వినతి పత్రమిచ్చారు. ఏఈ ఎస్‌కే రహీం, కార్మికులు సాగరమూర్తి, సింహాచలం, రాము, పైడిరాజు, శ్రీను ఉన్నారు.

క్రీడా మైదానాలు అభివృద్ధి చేయాలి: ఏయూ వీసీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 24: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని క్రీడా మైదానాలను అభివృద్ధి చేసి, విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని ఇన్‌చార్జి పకులపతి, స్పోర్ట్సు బోర్డు చైర్మన్ ఆచార్య జి.శశిభూషణరావు పేర్కొన్నారు. సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన స్పోర్ట్సు బోర్డు వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏయూలో సుమారు పదివేల మంది విద్యార్థులున్నారని, క్రీడా మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మైదానాల చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. అంతర్ కళాశాలల క్రీడా పోటీలను నిర్వహించే వర్సిటీ పరిధిలోని కళాశాలలకు రూ.20 వేలు నిర్వహణ ఖర్చులు అందజేయాలని, అంతర్ వర్సిటీ టోర్నీలలో ఏయూకు ప్రాతినిథ్యం వహించే క్రీడాకారులు, కోచ్‌లకు అందించే రోజు భత్యాన్ని రూ.400కు పెంచాలని తీర్మానించారు. స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి, సభ్యులు వెంకటేశ్వరరావు, ఎంవీ.మాణిక్యాలు పాల్గొన్నారు.

చెస్ వుమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ సాహితీకి కలెక్టర్ అభినందనలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 24: చెస్ క్రీడారంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మక వుమెన్ గ్రాండ్ మాస్టర్ టైటిల్‌కు చేరువలోనున్న వుమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ సాహితీని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అభినందించారు. పలు టోర్నీల్లో పాల్గొని పతకాలు సాధించిన సాహితీతోపాటు కోచ్‌గా వ్యవహరిస్తున్న ఆమె తండ్రి లోకేశ్ మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్‌ను కలిసి సాహితీ సాధించిన విజయాలను వివరించారు. వుమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్, వుమెన్ క్యాండిడేట్ మాస్టర్, వుమెన్ ఫిడే మాస్టర్ టైటిల్స్‌ను సొంతం చేసుకుని ప్రపంచ ర్యాపిడ్, బ్లిడ్జ్ ర్యాంకింగ్‌లో 13వ స్థానంలో ఉన్నట్టు చెప్పారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన నగదు ప్రో త్సాహక బహుమతులు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆమెను కలెక్టర్‌ను అభి నందించి, నగదు ప్రోత్సాహకాలు చెల్లించేలా చర్య లు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి జూన్ గ్యాలియట్ పాల్గొన్నారు.



కలెక్టర్‌తో సాహితి, కోచ్/తండ్రి లోకేశ్, డీఎస్‌డీవో

టీడీపీ నేత అనుయాయునికే అన్న క్యాంటీన్ క్యాషియర్‌గా బాధ్యతలు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 24: గ్రేటర్ 35 వార్డు ఇందిర మునిసిపల్ స్టేడియం వద్ద అన్నక్యాంటీన్ క్యాషియర్ విధుల్లో టీడీపీ వార్డు అధ్యక్షుడు బొచ్చారామిరెడ్డికు చెందిన యువతి నియమించారు. మంగళవారం రామిరెడ్డి సిఫార్సు చేసిన ఈ యువతికే హరే కృష్ణ మూమెంట్ నిర్వాహకులు ఇవ్వాల్సి వచ్చింది. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' హరేకృష్ణ మూమెంట్ నిర్వాహకుల వద్ద ప్రస్తావించగా, టీడీపీ, జనసేన నాయకుల సిఫార్సులను అడ్డుచెప్పే ధైర్యం చేయలేకపోయామన్నారు. విధుల నుంచి తొలగించిన సంధ్యకు అక్షయ పాత్ర వంటశాలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 24: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైలు పట్టాలపై జీఆర్పీ పోలీసులు మంగళవారం గుర్తించారు. జీఆర్పీ ఎస్ఐ లక్ష్మి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి రైలు పట్టాల వద్ద ఓ వ్యక్తి గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో మృతి చెందినట్టు భావిస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని, వయసు సుమారు 45 నుంచి 50 మధ్య ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించామని, తెలిసినవారుంటే 7382058996 నంబరులో సంప్రతించాలన్నారు.

రాజేంద్రనగర్‌లో భారీ చోరీ

సీతంపేట, సెప్టెంబరు 24: సీతంపేట రాజేంద్రనగర్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు చిక్కాల సర్వ, ఈశ్వరరావు తెలిపిన వివరాలివి.. రాజేంద్రనగర్‌లో ఈశ్వరరావు నివాసం ఉంటున్నారు. ఈ నెల 23న ఉదయం 8 గంటలకు ఉద్యోగ రీత్యా బయటకు వెళ్లాడు. అతని భార్య సర్వ 12 గంటల సమయంలో కుమారుడు చదువుతున్న గీతం కాలేజీకి వెళ్లారు. ఇంట్లో ఆమె అత్తయ్య ఉన్నారు. సర్వ తిరిగి వచ్చేసరికి బీరువా తెరిచి ఉంది. అందులో ఉన్న సుమారు ఏడు తులాల బంగారం, రూ.2.8 లక్షలు చోరీ జరిగినట్టు గుర్తించి ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా దీంతో సీఐ బంగారు పాప, ఎస్ఐ రవి విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్ నమూనాలను సేకరించింది. అయితే బాధితురాలు రూ.2.8 లక్షలు, బంగారం పోయినట్టు ఫిర్యాదులో పేర్కొనగా, పోలీసులు మాత్రం రూ.50 వేలు మాత్రమే చోరీకి గురైనట్టు ఫిర్యాదులో రాయాలని ఆదేశించడం విమర్శలకు దారితీసింది.

ఏయూలో విద్యార్థుల మధ్య ఘర్షణ

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులకు, బయట విద్యార్థులకు సోమవారం రాత్రి క్యాంపస్ లోపల గొడవ జరిగింది. ఒక అమ్మాయితో ఇరువర్గాల వారు స్నేహంగా మెలగడమే గొడవకు కారణంగా భావిస్తున్నారు. దీంతో వారు రెండు వర్గాలుగా విడిపోయి బాహాబాహీకి దిగారు. దీనిని చూసిన స్థానికులు డయల్ 100కు కాల్‌చేశారు. అదే సమయంలో క్యాంపస్ హాస్టళ్లలో ర్యాగింగ్ జరిగినట్టు ఫిర్యాదు అందింది. దీంతో మంగళవారం రాత్రి పోలీసులు క్యాంపస్‌లోపల తనిఖీలుచేశారు. రెక్టార్ ఆచార్య కిశోర్‌బాబు హాస్టళ్లను పరిశీలించారు.అయితే ఇరువర్గాల మధ్య ఘర్షణకు కారణమైన విద్యార్థినిని పదిరోజులపాటు సస్పెండ్ చేసినట్టు తెలిసింది. దీనిపై అధికారులు నోరు మెదపడంలేదు.

27న కంచరపాలెంలో జాబ్‌మేళా

కంచరపాలెం, సెప్టెంబరు 24: కంచరపాలెం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈనెల 27న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు సబ్ రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి శ్యాంసుందర్ నిట్టల తెలిపారు. అపోలో ఫార్మసీ, ఇన్నోవా స్టోర్స్, డీమార్టు, తదితర సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో పూర్తిచేసిన వారు నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కాగా ఈనెల 26న ఏయూ కాన్వొకేషన్ హాల్ ఎదుట మెరైన్ గ్రౌండ్స్ వద్ద దివ్యాంగులకు జాబ్‌మేళాను నిర్వహిస్తారు.

మహో రచ్చ

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌అఫీషియో సభ్యుడు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, కుంబా రవిబాబు, పందుల రవీంద్ర బాబుతోపాటు బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జనసేనకు చెందిన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా ఇటీవల మరణించిన సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరి, పశ్చిమ బెంగాల్‌లో హత్యాచారానికి గురైన మెడికో మృతిపట్ల సంతాపం ప్రకటించారు. అనంతరం పలు అంశాలపై చర్చ సాగింది. మధ్యాహ్న భోజన విరామ అనంతరం టీడీపీ కార్పొరేటర్ ఒకరు నగరంలో పారిశుద్య కార్మికుల జీతాల నుంచి ఆదాయ పన్ను పేరిట మినహాయించిన రెండు శాతం సొమ్మును కొంతమంది యూసీడీ అధికారులు, సిబ్బంది కలిసి పంచుకున్నారని, ఈ వ్యవహారంలో మేయర్‌కు కూడా ముడుపులు అందాయని ఆరోపించడంతో కౌన్సిల్ సమావేశంలో ఒక్కసారిగా దుమారం రేగింది.

సభను కుదిపేసిన యూసీడీ కుంభకోణం

వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి యూసీడీలో రూ.4.75 కోట్లు అవినీతి జరిగిందంటూ 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆరోపించారు. దీనికి సంబంధించి వైసీపీ కార్యాలయం పేరుతో కొంతమంది అప్పటి రాష్ట్ర మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మికి ఫిర్యాదు చేశారంటూ ఆ ప్రతిని సభలో చదివి వినిపించారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వం పసుపు కుంకుమ పేరుతో ఒక్కొక్కరికి రూ.పది వేలు చొప్పున జమ చేయగా, ఇన్‌యాక్టివ్‌గా ఉన్న 1,800 గ్రూపులతో ఆర్పీల ద్వారా కొత్తగా అకౌంట్ ఓపెన్ చేయించి రూ.95 లక్షలు యూసీడీ అధికారులు కాజేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 'ఆసరా' పథకం కింద మహిళా సంఘాలకు డబ్బులు ఇస్తే, జీవీఎంసీ పరిధిలోని 20 వేల గ్రూపుల్లో ఉన్న రెండు లక్షల మంది సభ్యుల నుంచి రూ.వంద చొప్పున రూ.20 లక్షలు యూసీడీ సిబ్బంది వసూలు చేశారని ఆరోపించారు. కొవిడ్ సమయంలో మాస్కులు కొనుగోలు పేరుతో నగరంలో లేని మహిళా ఆర్పీ ఖాతాకు రూ.ఐదు లక్షలు బదిలీ చేశారని ఆరోపించారు. వైసీపీ నేతల పిక్నిక్ పేరుతో వెయ్యి మంది ఆర్పీల నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. అలాగే మహిళా సంఘాల ఆడిట్ పేరుతో కొంత, పారిశుద్య కార్మికుల వేతనాల నుంచి ఐటీ పేరుతో కోత పెట్టిన రెండు శాతం మొత్తం కలిపి దాదాపు రూ.4.75 కోట్లు కుంభకోణం జరిగిందని ఆరోపించడంతో సభలో కలకలం రేపింది. దీనిలో మేయర్‌తో పాటు అప్పటి కమిషనర్‌కు కూడా వాటాలు ఉన్నాయని, అందువల్లే రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించినా తొక్కిపడేశారంటూ మరో ఫిర్యాదు వెళ్లిందని రాపర్తి కన్నా ఆరోపించారు. దీంతో కూటమి సభ్యులతోపాటు సీపీఐ, సీపీఎం సభ్యులు కూడా మేయర్ రాజీనామా చేసి విచారణకు సహకరించాలని పట్టుబట్టారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది.పోడియంను సభ్యులు చుట్టుముట్టి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడంతో ఏం చేయాలో పాలుపోక మేయర్ సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించి సమావేశం నుంచి వెళ్లిపోయారు.

కూటమి వర్సెస్ వైసీపీ

... 5వ పేజీ తరువాయి

టేబుల్ ఎజెండాగా పరిగణనలోకి తీసుకోవాలని కమిషనర్ సంపత్‌కుమార్‌ను మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆదేశించారు. దీనిపై టీడీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐదేళ్ల కిందట తాము నిరాహార దీక్షలు, ధర్నాలు చేశామని, కౌన్సిల్‌లో తీర్మానం కూడా చేయాలని ప్రతిపాదిస్తే తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించామని, ఆ విషయాన్ని విస్మరించి ఇప్పుడు టీడీపీ ప్రస్తావన లేకుండా ఆయా అంశాలపై తీర్మానానికి ఎలా సిద్ధపడుతున్నారంటూ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదేళ్లపాటు స్టీల్‌ప్లాంటును కాపాడే ప్రయత్నం చేయకుండా వదిలేశారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రూ.మూడు వేల కోట్లు తెప్పించామని గుర్తుపెట్టుకోవాలన్నారు. 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోక్ మాట్లాడుతూ వైసీపీలో తాను కొంతకాలం కిందటి వరకూ కొనసాగానని దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీని పక్కనపెట్టుకున్న నాయకుడు, మాస్కులు లేవన్నాడని నడిరోడ్డుపై దళిత వైద్యుడు బట్టలు ఊడదీసి కొట్టి, చనిపోయేలా చేసిన ప్రభుత్వం...ఇవన్నీ మరిచిపోయి ఫ్లెక్సీ చిరిగితే దళితులకు అన్యాయం చేశారంటున్న కార్పొరేటర్లను చూస్తుంటే జాలేస్తోందన్నారు. వైసీపీ హయాంలో ఆరెడ్డి చెప్పారు...ఈ రెడ్డిచెప్పారంటూ తీర్మానాలను ఆమోదించేశారే గానీ...తమకు మాట్లాడే అవకాశం మాత్రం ఇవ్వలేదన్నారు. పాతజైలురోడ్డులోని ఫుడ్‌కోర్టును తొలగించాలని మేయర్‌ను డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ కోరారు. దీనిపై జనసేన ఫ్లోర్‌లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు మాట్లాడుతూ ఫుడ్‌కోర్టును తొలగించాలని ఏడాది కిందట కౌన్సిల్ తీర్మానం చేసినా వైసీపీ పాలకవర్గంలోని పెద్దలవల్లే ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. 32 దుకాణాలు ఇప్పుడు 167 కావడానికి కారణం డిప్యూటీ మేయరేనని ఆరోపించారు.

ఏపీఎంఎస్ఎంఈడీసీ చైర్మన్‌గా శివశంకర్

... 5వ పేజీ తరువాయి

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా విశాఖ ఉత్తర నియోజకవర్గానికి చెందిన వెంగమాంబ శ్రీనివాస్ (బీజేపీ), అంగ దుర్గాప్రశాంతి (జనసేన) నియమితులయ్యారు. ఏపీ పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా భీమిలి నియోజకవర్గ పరిధిలో మధురవాడకు చెందిన దాసరి శ్రీనివాస్ నియమితులయ్యారు. కాగా అనకాపల్లి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే. పీలా గోవింద సత్యనారాయణ కీలకమైన ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా, పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబును ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా నియమితుల య్యారు.

అప్పన్న సన్నిధిలో శాంతి హోమం

... 5వ పేజీ తరువాయి

శాంతిహోమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి ద్రవ్యాలను భక్తులతో స్పృశింపజేసిన తరువాత వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అగ్నికి సమర్పించారు. పూజలందుకున్న ప్రధాన కలశాన్ని ప్రధానార్చకులు శిరస్సున దాల్చి భక్తులతో కలిసి ఆలయ బేడామండప ప్రదక్షిణ చేసి, అంతరాలయంలో స్వామి మూల విరాట్టు చెంతన ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. పవిత్ర జలాలతో ప్రోక్షణ జరిపారు. అనంతరం యజ్ఞప్రసాదం, భస్మాన్ని భక్తులకు అందజేశారు. హోమంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పీవీజీఆర్ నాయుడు (గణబాబు), పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో మహా సంప్రోక్షణ

సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కూడా ప్రసాదాల తయారీకి నాణ్యత లేని నెయ్యి వాడినట్టు ప్రాథమికంగా నిర్ధారించిన తరుణంలో ఆ అపచార పరిహారార్థం మంగళవారం మహా సంప్రోక్షణ కావించారు. వేకువజామున సుప్రభాత సేవ తరువాత పవిత్ర గంగధార, నాగధారల నుంచి తీసుకువచ్చిన జలాలతో ఆలయాన్నంతటినీ కొత్వాల్ లంక సూరిబాబు సారథ్యంలో సిబ్బంది శుభ్రపరచారు. అనంతరం అప్పన్న సన్నిధిలో శాస్త్ర విధానంలో జరిపిన పుణ్యాహవచన పుణ్యజలాలతో ఆలయపరిసరాలు, ప్రసాదాల తయారీకి ముడి సరకులు నిల్వ ఉంచుప్రధాన స్టోర్స్ ప్రసాదాలు తయారుచేస్తున్న పొయ్యిలను ప్రోక్షణ కావించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

... 5వ పేజీ తరువాయి

ముగ్గురూ సీతంపేటలోని ప్రవీణ్ ఇంటికి బయలుదేరారు. సరిగ్గా సంజీవయ్య కాలనీ దగ్గరకి వెళ్లేసరికి వాహనం అదుపుతప్పి ప్రమాదం చోటుచేసుకుంది. ప్రవీణ్ బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ప్రశాంత్ ఇంటర్ మధ్యలో ఆపేశాడు. గాయపడిన మహేష్ పెందుర్తి సమీపంలో గల వెల్ఫేర్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుచున్నాడు.

యూసీడీ డీసీఎం నాగరాజుపై సస్పెన్షన్ వేటు

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూసీడీ విభాగంలో రూ.4.75 కోట్ల కుంభకోణం జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో ప్రధాన పాత్రధారుడిగా పేర్కొంటున్న యూసీడీ డీసీఎం వి.నాగరాజును సస్పెండ్ చేస్తూ జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. నాగరాజుపై కొంతకాలంగా వరుస ఫిర్యాదులు వస్తున్నాయని, దాంతోపాటు యూసీడీ కుంభకోణంపై రాష్ట్రప్రభుత్వానికి అందిన ఫిర్యాదు మేరకు పూర్తిస్థాయిలో విచారణ జరపాలంటూ రాష్ట్ర మెప్మా కమిషనర్ కార్యాలయంనుంచి వచ్చిన మెమోను ఫైల్ నుంచి మాయం చేశారని నాగరాజుపై ఆరోపణలు రావడంతో ఆయనపై వేటు వేశారు.

వార్డుల్లో సమస్యలపై వినతులు

మహారాణిపేట, సెప్టెంబరు 24: గ్రేటర్ 38 వ వార్డులో సమస్యలను పరిష్కరించాలనికార్పొరేటర్ గోడి విజయలక్ష్మి, టీడీపీ వార్డు ఇన్‌చార్జి నరసింహచారి కోరారు. ఈ మేరకు కమిషనర్ పి. సంపత్‌కుమార్, మేయర్ హరి వెంకట కుమారిలకు వినతి పత్రం అందించారు. టౌన్‌హాల్‌ను గతంలో సుమారు రూ. 7 కోట్లతో పునర్నించి వృథాగా వదిలేశారన్నారు. పైపులైన్ల లీకేజీలతో కలుషితమైన తాగునీరు సరఫరా అవుతోందని చెప్పారు. లబ్ధిదారులకు హుద్‌హుద్, టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లుకేటాయించాలని కోరారు.

41వార్డులో సమస్యలపై..

జ్ఞానాపురం: స్థానిక 41 వార్డులో సమస్యలపై కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా కమిషనర్ సంపత్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వీధి దీపాల సమస్య, సుబ్బలక్ష్మీనగర్‌లో డ్రెయిన్స్‌లో పూడికలు తొలగించాలని కోరారు.



పోస్టర్లను ఆవిష్కరించిన సీఐటీయూ నాయకులు

హెచ్‌పీసీఎల్ గేటు వద్ద సీఐటీయూ ధర్నా

మల్కాపురం, సెప్టెంబరు 24: కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 30న జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా చేపట్టనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద మంగళవారం ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెచ్‌పీసీఎల్, డాక్‌యార్డు, కోరమాండల్ ఎరువుల కర్మాగారంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలన్నారు. అనంతరం మహా ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు, నాయకులు శ్రీను, కోటేశ్వరరావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక సబ్ రిజిస్ట్రార్‌గా తారకేశ్


తారకేశ్

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 24: గాజువాక సబ్ రిజిస్ట్రార్‌గా టి.తారకేశ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. షీలానగర్‌లో గల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చేపట్టిన ఆయనకు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఇప్పటివరకు విజయనగరం జిల్లా కొత్తవలస సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఆయన బదిలీపై గాజువాక వచ్చారు. ఇక్కడ పనిచేసిన పి.రాజుకు నెల్లిమర్ల సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ అయింది.

పంచాయతీ రాజ్ డీఈగా రమణమూర్తి


పీవీ రమణమూర్తి


పెందుర్తి, సెప్టెంబరు 24: పెందుర్తి నియోజకవర్గ పరిధి సబ్బవరం, పెందుర్తి, పరవాడ మండాలకు సంబంధించిన పంచాయతీరాజ్ పీఆర్ఐ డివిజనల్ ఇంజనీర్‌గా పీవీ రమణమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన పెందుర్తి మండల పరిషత్ ప్రాంగణంలో గల డివిజనల్ ఇంజనీరింగ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఏఈ స్వాతి, సిబ్బంది అప్పారావు, సత్యవతి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.

బతుకమ్మ ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరించిన ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 24: స్టీల్‌ప్లాంటులో వచ్చే నెల పదో తేదీన బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహిస్తామని ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంటులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సీ-భవన్‌లో ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా అందరి సహకారంతో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతినిదులు ఎస్.వీరేశం, ఎస్.కుమారస్వామి, జి.ఆనంద్, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, నరసింగరావు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తా: దుర్గా ప్రశాంతి



మల్కాపురం, సెప్టెంబరు 24: రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తనను నియమించడం పట్ల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, కూటమి ప్రభుత్వ పెద్దలకు అంగ దుర్గాప్రశాంతి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా దుర్గాప్రశాంతికి పలువురు అభినందనలు తెలిపారు.

గణేశుని ఊరేగింపులో అగ్ని ప్రమాదం: ఒకరికి గాయాలు

సింధియా, సెప్టెంబరు 24: జీవీఎంసీ 63వ వార్డు పరిధి జైఆంధ్ర కాలనీలో సోమవారం జరిగిన వినాయక నిమజ్జన ఊరేగింపులో ప్రమాదం చోటుచేసుకుంది. ఊరేగింపులో భాగంగా ఏర్పాటు చేసిన వాహనంలో డ్రైవర్ సీటు వెనక భాగంలో బాణసంచా పెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఒక్కసారిగా అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో డ్రైవర్ దాడి రాజేశ్ (24)కు వెనక భాగంలో గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మల్కాపురం పోలీసులు వివరాలు సేకరించి ప్రమదానికి కారణమైన పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీలు

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 24: అనకాపల్లి జిల్లా మునగపాకలో మరిడిమాంబ జాతర సందర్భంగా బుధవారం నుంచి రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు విద్యుద్దీప కాంతుల్లో మ్యాట్‌పై నిర్వహించే ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచే జట్టుకు రూ.25 వేలు, ద్వితీయ స్థానానికి రూ.20 వేలు, మూడు, నాలుగు సానాల్లో నిలిచే జట్లకు రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు.

వరద బాధితులకు గ్యాస్ స్టౌవ్‌లు, కుక్కర్లు అందజేత

అగనంపూడి, సెప్టెంబరు 24: జీవీఎంసీ 85వ వార్డు పరిధి గొన్నవానిపాలెంలో గల ఏబీఎస్ పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకులు పి.మాలకొండయ్య విజయవాడలోని వరద బాధితులకు అండగా నిలిచారు. ఈ మేరకు మంగళవారం వరద బాధితులను కలిసి వంద గ్యాస్ స్టౌవ్‌లు, వంద కుక్కర్లను పంపిణీ చేశారు. అలాగే కొంత నగదును చెక్కు రూపంలో సీఎం చంద్రబాబుకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే అగనంపూడికి చెందిన బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు వరద బాధితుల సహాయార్థం రూ.ఐదు వేల నగదును ప్రభుత్వ బ్యాంక్ ఖాతాలో జమ చేశారు.

మాధవపెద్ది సురేశ్‌కు 'బాలు' పురస్కారం


సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేశ్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

విశాఖపట్నం, సెప్టెంబరు 24: ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేశ్‌కు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం సంగీత పురస్కారం లభించింది. పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఎస్పీ బిజమ్ పేరిట మంగళవారం యాక్మి నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి అలరించింది. గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 4వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన జ్ఞాపకాలను గుర్తుచేశారు. పురస్కార గ్రహీత సురేశ్ మాట్లాడుతూ సినీ సంగీత వినీలాకాశంలో బాలు గాత్రం చిరకాలం నిలిచిపోతుందన్నారు. అసమాన ప్రతిభాపాటవాలతో వేలాది పాటలకు ప్రాణం పోసిన గానగంధర్వుడని కొనియాడారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ సంగీత ప్రపంచంలో మకుటం లేని మహారాజు బాలు అన్నారు. స్వరాభిషేకం ఫేమ్ గాయకులు రాము, నాదప్రియ, హజ్రత్ పాడిన పాటలు రంజింపజేశాయి. యాక్మి నిర్వాహకుడు ప్రతాప్, దాడి రత్నాకర్, పైడా కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


66వ వార్డులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు


వాలిమెరక జుత్తాడలో ఓ ఇంటి గోడపై స్టిక్కర్ అతికించిన పంచకర్ల రమేశ్‌బాబు

సంక్షేమం వైపు పరుగులు తీస్తున్న ఆంధ్రప్రదేశ్

ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, సెప్టెంబరు 24: ఆంధ్రప్రదేశ్‌ను సంక్షేమం దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరుగులు తీయిస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 66వ వార్డులో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభు త్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అగనంపూడి టోల్‌గేటును ఎత్తివేయించామన్నారు. అనర్హుల పెన్షన్లను తొలగించి అర్హులకు అందిస్తామన్నారు. టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాక అర్హులైన లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. జీవో నంబర్-301 ద్వారా గాజువాక హౌస్ కమిటీలో పట్టాలు పొందలేని వారికి మళ్లీ వాటిని అందించేందుకు కృషి చేస్తామని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేకూర్చడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. చేస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సత్యపద్మ, నాయకులు ఎండీ రఫీ, ఎండీ ముర్తజా, ప్రసాదుల శ్రీనివాస్, పుచ్చా విజయ్‌కుమార్, పి.విజయ్‌కుమార్, లంకా లత, రమణ, పప్పు రాజారావు, తదితరులు పాల్గొన్నారు.


పారిశ్రామిక ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు


94వ వార్డులో కరపత్రాలతో టీడీపీ నాయకుడు నరసింహనాయుడు, తదితరులు

వంద రోజుల పాలనతో ఏపీకి ఊపిరి: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి: జనం మెచ్చేలా కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనతో ఏపీకి ఊపిరి వచ్చినట్టయిందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని వాలిమెరక జుత్తాడలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి పనులను వివరించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. పలు ఇళ్ల గోడలకు స్టికర్లను అతికించారు. అనంతరం జరిగిన సభలో పంచకర్ల మాట్లాడుతూ సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధిని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ప్రజలకు అందిస్తున్నారన్నారు. దివ్యాంగుల, సామాజిక పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు, డీఎస్సీ నోటిఫికేషన్ వంటి వాటితో ప్రజల మన్ననలను పొందగలిగామన్నారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ 'పెందుర్తి' ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ వంద రోజుల్లోనే ప్రజారంజక పాలనను అందించామని, రానున్న కాలంలో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా సీఎం చంద్రబాబు మారుస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, జనసేన జిల్లా కార్యదర్శి బతి సింహాచలం, మాజీ ఎంపీటీసీ సియ్యాద్రి అప్పలరాజు, కె.కనకరాజు, ఎం.కిరణ్, తహసీల్దార్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 58, 61 వార్డుల్లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ త్వరలో అర్హులందరికీ పింఛన్లు అందజేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, నాయకులు కోరాడ శ్రీనివాసరావు, అంగ దుర్గాప్రశాంతి, పొత్తబత్తుల శ్రీనివాసరావు, మజ్జి సోమేశ్, కాకి పోలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

94వ వార్డులో ఇంటింటికీ ప్రచారం

వేపగుంట: జీవీఎంసీ 94వ వార్డు పరిధిలోని సేనాతివానిపాలెం, ఎల్‌బీ నగర్, జ్యోతి నగర్ పరిసర ప్రాంతాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు బొబ్బర నరసింహనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటి గోడకు స్టిక్కర్లను అతికించారు. నాయకులు అయిత రాజు, శివ, సచివాలయం అడ్మిన్ జి.అమ్మ రాజు, వెంకటరావు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న ప్రభుత్వ మద్యం షాపుల ఉద్యోగులు

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ మద్యం దుకాణాల సిబ్బంది ఆందోళన

పెందుర్తి, సెప్టెంబరు 24: కొత్త మద్యం పాలసీని ప్రవేశపెట్టనున్న కూటమి ప్రభుత్వం విధానంతో ఇప్పటివరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను తొలిగించే ప్రయత్నం జరుగుతుందని ఆరోపిస్తూ మంగళవారం జెర్రిపోతులపాలెంలోని బ్రూవరీస్ లిమిటెడ్ లిక్కర్ డిపో వద్ద సిబ్బంది ఆందోళన చేశారు. మద్యం దుకాణాలను ప్రైవేటుపరం చేస్తే ఈ డిపో పరిధిలోని 29 మద్యం షాపుల్లో పనిచేస్తున్న తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాలసీకి తాము వ్యతిరేకం కాదని తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లకుండా విధులు నిర్వహిస్తూనే ధర్నా చేపట్టడం జరిగిందన్నారు.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కోరారు. అనంతరం డిపో మేనజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. డిపోలోని లిక్కర్ వాహనాలను కదలనివ్వకుండా చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో హరినాథ్, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూను అపవిత్రం చేయడం దారుణం

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, సెప్టెంబరు 24: కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని గత వైసీపీ ప్రభుత్వం కల్తీ చేసి తిరుమల విశిష్టతను అపవిత్రం చేయడం దారుణమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మండిపడ్డారు. పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు సంఘీబావంగా పంచకర్ల ఆధ్వర్యంలో మంగళవారం జనసేన నాయకులు దీక్ష చేపట్టారు. చినముషిడివాడలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ఇక్కడి పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ లడ్డూ కల్తీతో సనాతన ధర్మానికి వైసీపీ నాయకులు చేటు తెచ్చారన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి బతి సింహాచలం, నాయకులు సేనాపతి సోమశేఖర్, కంచిపాటి మధు, డీబీఎల్ నాయుడు, వి.పార్వతి, కె.రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు

దోషులకు శిక్ష తప్పదు

కూర్మన్నపాలెం: తిరుమల లడ్డూ ప్రసాదంలో అవినీతికి పాల్పడిన వారికి శిక్ష తప్పదని జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. 87వ వార్డు రాజులపాలెం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం తెలుపుతూ కూటమి నాయకుల ఆధ్వర్యంలో సంప్రోక్షణ దీక్షలో పాల్గొన్నారు. ముందుగా శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు.


వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రాయశ్చిత దీక్షలో కూర్చున్న కోన తాతారావు, తదితరులు

ఈ సందర్భంగా కోన తాతారావు మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ధర్మాలను కాపాడుకోవలసిన బాధ్యత హిందువులందరిపై ఉందన్నారు. పాలకులు తమ స్వార్థాల కోసం ఆలయాలను ఉపయోగించుకోరాదని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు గడసాల అప్పారావు, ఇందిరా ప్రియదర్శిని, తిప్పల రమణారెడ్డి, కాద శ్రీను, కళావతి, షాలిని, జయలక్ష్మి, రామారావు, జ్యోతిరెడ్డి, మురళీదేవి, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంటక్ ఆధ్వర్యంలో ఉక్కు ఈడీ కార్యాలయం వద్ద ఆందోళన

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 24: స్టీల్‌ప్లాంట్ కార్మికుల పట్ల యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మండిపడ్డారు. ఉక్కు ఉద్యోగులకు హెచ్ఆర్‌ఏతో పాటు ఇతర అలవెన్స్‌లను నిలిపివేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ప్లాంట్ ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్న ఉద్యోగులకు ఇప్పుడు హెచ్ఆర్‌ఏతో పాటు ఇతర అలవెన్స్‌లను కూడా నిలిపివేయడం సమంజసం కాదన్నారు. ప్లాంటులో పూర్తి స్థాయి ఉత్పత్తి తీసేందుకు కార్మిక వర్గం సిద్ధంగా ఉన్నప్పటికీ, ఆ దిశగా ఉక్కు యాజమాన్యం చర్యలు చేపట్టకుండా, కార్మికులను ఇబ్బందులకు గురిచేసేలా చర్యలు చేపడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే ఉపసంహించుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్లాంట్ ప్రగతికి, ఉద్యోగుల సంక్షేమం కోసం యూనియన్ రాజీ లేని పోరాటాలు సాగిస్తుందన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, ఎస్ఏ నాయుడు, సుబ్బయ్య, కొమ్ము ప్రసాద్, దేముడు, ప్రభాకర్‌రెడ్డి, రాథోడ్, జె.మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఇంటక్ నాయకులు, కార్మికులు

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ విభాగంలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఉద్యోగికి తీవ్ర గాయాలవ్వడం దురదృష్టకరమని విభాగం ఇంటక్ నాయకులు పీవీ రమణమూర్తి, జీవీ సుబ్బయ్య పేర్కొన్నారు. ఇదే ప్రదేశంలో ఇప్పటికి మూడుసార్లు ప్రమాదాలు జరిగాయని, దీంతో ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందువల్ల ప్రమాదాల నివారణకు ఉక్కు యాజమాన్యం పటిష్ట చర్యలు చేపట్టాలని, భద్రతా ప్రమాణాలను పెంచాలని డిమాండ్ చేశారు.

ఉద్యమాలతో ఉక్కును పరిరక్షించుకుంటాం

కూర్మన్నపాలెం: ఐక్య ఉద్యమాలతోనే ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,321వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు సంక్షోభానికి కేంద్ర విధానాలే కారణమని, ఇప్పటికైనా స్టీల్‌ప్లాంటుకు నిధులను కేటాయించాలని కోరారు. మేధావుల మౌనం దేశ ప్రగతికి అవరోధమని, ఉక్కు ప్రైవేటీకరణపై వారు స్పందించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తే ఎన్నో కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ఉద్యమానికి యువత, మహిళలు, వివిధ కార్మిక సంఘాలు, మేధావులు, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు పలకాలని, త్వరలో ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజాబాబు, నరేశ్‌కుమార్, జి.ఆనంద్, శ్రీనివాస్, సతీశ్, జగదీశ్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యం

గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, సెప్టెంబరు 24: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. 67వ వార్డులో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్డులను పలువురికి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే శక్తివంతమైనదిగా భారతదేశం మారుతుందని, ఇదంతా ప్రధాని మోదీ కృషి ఫలితమేనన్నారు. బీజేపీ సభ్యత్వాన్ని తీసుకునేందుకు పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గంటా బాలకృష్ణ, మధుసూదన్, స్వామి, అన్నపూర్ణ, సత్యనారాయణ, గోవింద్, సింగ్, తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ సభ్యత్వం తీసుకున్న వారికి కార్డులు అందజేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు


సచివాలయంలోని రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

అగనంపూడి, సెప్టెంబరు 24: సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలని విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ సూచించారు. 85వ వార్డు పరిధి కొండయ్యవలసలోని సచివాలయాన్ని మంగళవారం ఆయన గాజువాక తహసీల్దార్ శ్రీవల్లితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సచివాయంలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సచివాలయంలో అందుతున్న సేవల గురించి అక్కడకు వచ్చిన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై వచ్చిన ప్రజలతో సిబ్బంది సానుకూలంగా మాట్లాడి వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించి వాటికి మరమ్మతులు చేపట్టి, వార్డు సచివాలయాలుగా వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ఆర్డీవో పేర్కొన్నారు. కాగా స్థానిక నాయకులు హుస్సేన్ సాహెబ్‌ను కలిసి పలు సమస్యలను వివరించారు. ఆయనను కలిసిన వారిలో నాయకులు బి.సత్యనారాయణ, చందా రమేశ్, తదితరులు ఉన్నారు.

'తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యం'

పెందుర్తి, సెప్టెంబరు 24: తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పెందుర్తిలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో మంగళవారం మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. పలువురు గర్భిణులకు పోషణ్ అభియాన్ ఆహారాన్ని అందజేశారు. తల్లి పేరుతో ఒక మొక్క నాటాలని పంచకర్ల సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, జనసేన నాయకులు నీలంశెట్టి శివ, డీబీఎల్ నాయుడు, సేనాపతి సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 24: బీహెచ్‌పీవీ బస్టాప్ వద్ద ఈ నెల 20న మృతి చెందిన గుర్తు తెలియని యాచకురాలికి మంగళవారం గాజువాక పోలీసులు, మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. మూడు రోజులపాటు కేజీహెచ్‌లో ఆమె మృతదేహం ఉన్నా ఎవరూ గుర్తించకపోవడంతో మంగళవారం మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ దీనకొండ కృష్ణంరాజు, సభ్యులు పి.శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావుల సహకారంతో ఎస్ఐ లంక సూర్యకళ గాజువాక శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిపారు.

వార్డుల్లోని సమస్యలపై మేయర్‌కు వినతి

మల్కాపురం/సింధియా, సెప్టెంబరు 24: గ్రేటర్ 40, 58 వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, గులిగిందల లావణ్య తమ వార్డుల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి మంగళవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. 40వ వార్డు పరిధి కాకరలోవలో రిటైనింగ్ వాల్ నిర్మాణం, యారాడకు రోడ్డు నిర్మాణం, ఏ కేసీ కాలనీ ఎంట్రన్స్‌లో డబుల్ రోడ్డు, బీఎస్ఎన్ఎల్ వాల్ పక్క నుంచి చిన్న రోడ్డును నిర్మించాలని, తదితర సమస్యలను మేయర్‌కు నాగేశ్వరరావు వివరించారు. అలాగే 58వ వార్డు ములగాడలో పోర్టు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని లావణ్య కోరారు.

నరవలో 'పొలం పిలుస్తోంది'

పెందుర్తి, సెప్టెంబరు 24: మండల వ్యవసాయాధికారులు నరవలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆత్మ పీడీ ఆశాదేవి ఆధునిక, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. రైతులంతా ఆరుతడి పంటలపై దృష్టి సారించాలన్నారు. బిందు సేద్యం, వ్యవసాయ రాయితీల గురించి తెలిపారు.

సినిమా గైడ్

- **మత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 53, టమాటా 46, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 30, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 26, క్యారెట్ 38, దొండకాయలు 34, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 85, మునక్కాడలు (కిలో) 84, బరబాటి 48, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 72, పొటల్స్ 44, కీరదోస 30, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 64, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికమ్ 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10లో..

2న బ్యాడ్మింటన్ టోర్నమెంట్



పోస్టర్ విడుదల చేస్తున్న రోటరీ ప్రతినిధులు

సీతంపేట, సెప్టెంబరు 24: అక్టోబరు 2వ తేదీన గాంధీ జయంతి పురస్కరించుకుని రోటరీక్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు క్లబ్ ప్రెసిడెంట్ ఎండీ యాసిన్ బాబా తెలిపారు. ద్వారకానగర్‌లోని రోటరీ క్లబ్ అధ్యక్షుడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ పోస్టర్‌ని క్లబ్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులు, మహిళలు డబుల్స్ విభాగాలు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. అనకాపల్లి నుంచి ఇచ్ఛాపురం వరకు 22 రోటరీక్లబ్‌లకు చెందిన 48 టీమ్‌లు పాల్గొననున్నట్లు తెలిపారు. విశాఖ రైల్వే ఇండోర్ స్టేడియంలో ఈ టోర్నీ జరుతుందన్నారు. ఆసక్తి గల రోటరీ సభ్యులు తమ పేర్లను ఈ నెల 28వ తేదీలోగా రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. వివరాలకు డాక్టర్ అశోక్ ఫోన్: 9866346347ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ చింతా నేతాజీ, క్లబ్ వైస్ ప్రెసిడెంట్ బి.భాస్కరరావు, రోటరీ సభ్యులు కేఎంకే రమేశ్, సూర్యతేజ, క్లబ్ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ బి.బ్రహ్మానందం పాల్గొన్నారు.

వరద బాధితులకు టీడీపీ లీగల్ సెల్ ఆర్థిక సాయం



శ్రీ భరత్‌కు చెక్కును అందజేస్తున్న ప్రతినిధులు

మహారాణిపేట, సెప్టెంబరు 24: తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు రూ. 2,71,116 లక్షలు విరాళంగా అందించారు. టీడీపీపై సానుభూతి గల న్యాయవాదుల సహకారంతో సేకరించిన ఈ మొత్తాన్ని మంగళవారం ఎంపీ శ్రీభరత్, జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ, కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్‌లకుఅందజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ నాయకులు బత్తి రాజశేఖర్, ఎస్.వి. రమణ, ఎస్. సతీష్ కుమార్, గొంపా సత్యనారాయణ, బి. ఉమాశంకర్, కె. అప్పలనాయుడు, డి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రామకృష్ణానగర్‌లో రక్తదాన శిబిరం



రక్తదాతలతో జనసేన నేత ఉషాకిరణ్

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 24 : గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్‌లో శ్రీ సంపత్ సాయి ఉత్సవ, సేవా కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. యువకులు రక్తదానం చేసి విశాఖ బ్లడ్ సెంటర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత బండి కన్నా తదితరులు పాల్గొన్నారు.

సినీ ఏజెంట్ వాసు మృతి

అకయ్యపాలెం, సెప్టెంబరు 24 : సినీ ఏజెంట్ వాసుపల్లి వాసు మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వాసు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచారు. దీంతో ఆయన పార్థివ దేహన్ని కొబ్బరితోటలోని స్వగృహానికి తీసుకువెళ్లారు. వాసు జూనియర్ ఆర్టిస్టుగా, జూనియర్ ఆర్టిస్టు యూనియన్ కోశాధికారిగా విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారు. ఆయన మృతికి హైదరాబాద్, విశాఖ సినీ మేనేజర్లు, ఏజెంట్లు, జూనియర్ ఆర్టిస్టులు సంతాపం వ్యక్తం చేశారు.

కేజీహెచ్‌లో నిరుపయోగంగా బ్యాటరీ వాహనాలు

» రోగులకు ఇబ్బందులు

మహారాణిపేట, సెప్టెంబరు 24: కేజీహెచ్‌లో రోగులను ఒకచోట నుంచి మరో చోటుకు తరలించేందుకు ఉపయోగపడే పలు వాహనాలు షెడ్డుకే పరిమితం చేస్తున్నారు. దీంతో రోగులు, వృద్ధులు నడవలేని స్థితిలో ఉన్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోగులు ఒక విభాగం నుంచి మరో విభాగానికి, కొండ మీద ఉన్న సూపర్‌స్పెషాలిటీ వార్డులకు వెళ్లేందుకు గతంలో సమస్యలు ఎదుర్కొనేవారు. ఈ స్థితిలో ఆరు నెలల కిందట ఓ సంస్థ సీఎస్‌ఆర్ నిధులనుంచి అధునాతన ఆరు బ్యాటరీ వాహనాలను అందించింది. అవి రోగులను ఉచితంగా ఆసుపత్రిలో పలుచోట్లకు తరలింపులో ఎంతగానో ఉపయోగపడ్డాయి. అలాంటిది ఎలాంటి సాంకేతిక సమస్యలులేకుండా వినియోగంలోఉన్న ఆరు వాహనాల్లో ఐదింటిని ఆస్పత్రిలో ఓ మూలన షెడ్డుకు పరిమితం చేశారు. మంగళవారం ఉదయం రోగులతో అత్యంత రద్దీగా ఉన్న సమయంలో వాటిని వదిలేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తంచేశారు.గతంలో, ఇలాంటి వాహనాలు లేక రోగులు ఆసుపత్రిలో ఆటోలను ఆశ్రయించేవారు. ఒక వార్డునుంచి, సూపర్ స్పెషాలిటీ విభాగాలకు తీసుకువెళ్లేందుకు మనిషి వద్ద సుమారు రూ. 100 వసూలు చేసేవారు.ఈస్థితిలో రోగులకు సౌకర్యార్థం స్వచ్ఛంద సంస్థలు, దాతలు అందించిన వాహనాలను సరిగ్గా వినియోగించు కోలేకపోవటంపై విమర్శలు తలెత్తుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల అధిక సంఖ్యలో రోగులతో రద్దీగా ఉంటుంది. ఆ సమయంలో ఈ వాహనాల డ్రైవర్లకు ఒత్తిడిగా ఉంటుంది. ఈ సమయంలో వారు బాధ్యతలనుంచి తప్పించుకు తిరుగుతున్నట్టు సమాచారం. అధికారులు ఇకనైనా స్పందించి వాహనాలు సక్రమంగా వినియోగించేలా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



రోగులు వచ్చే సమయంలో షెడ్డులో ఉన్న బ్యాటరీ వాహనాలు

27న యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సమ్మె



నిరసనలో బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు

సీతమ్మధార, సెప్టెంబరు 24: సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు, అధికారుల సంఘం చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సంఘ నాయకులు కోరారు. సీతమ్మధార యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఎంప్లాంయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, బ్యాంక్‌లో ఖాళీ పోస్టుల భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పని ఒత్తిడిని తగ్గించాలని, అప్రెంటీస్ నియామకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులంతా ప్లకార్డులతో సమస్యలపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘ నాయకులు కె.రమేష్, రీజనల్ కార్యదర్శి ఆర్.వసంతరావు, సాగర్, శ్రీనివాస్, ప్రత్యూష, బ్యాంక్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు బజార్‌ల సెలవుపై ఆరా....

సీతమ్మధార, సెప్టెంబరు 22: సీతమ్మధారలోని రైతుబజార్‌లో మంగళవారం విచ్చేసిన రైతులు, వినియోగదారులతో జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖాధికారి యాసిన్ రైతుబజార్ సెలవుపై ఆరా తీశారు. రైతు బజారుకు వారాంతపు సెలవుపై అభిప్రాయాలను సేకరించారు. పలువురు రైతులు తమకు వారంలో ఒకరోజు సెలవు కావాలని అభి ప్రాయం వ్యక్తం చేశారు.



రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖాధికారి యాసిన్

ప్రైవేటు సంస్థలు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి: వంశీకృష్ణ

జగదాంబ కూడలి, సెప్టెంబరు 24: పేదల వైద్య సేవలందించేందుకు పోర్టు ట్రస్టు అనుబంధంగా ఉన్న ప్రైవేటు సంస్థలు ముందుకు రావాలని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం పాతపోస్టాఫీసు మత్స్యకార భవనంలో గీతం హాస్పిటల్స్ నేతృత్వంలో వేదాంత, వీజీసీబీలు పోర్టు సహకారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పేదలకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ సాధిక్, షిరీన్ రహమాన్, వేదాంత సీఈవో సతీశ్, కూటమి స్థానిక నాయకులు దానేష్, చిన్న, లడ్డూ, హీరా. అనిఫ్, కృష్ణ, కోటమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

రైల్వే బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 24: తూర్పు కోస్తా రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ వాల్తేరు డివిజన్ నిర్వహిస్తున్న అఖిల భారత రైల్వే 78వ పురుషుల, 17వ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. రైల్వే శ్రీనివాస కల్యాణ మండపం వద్ద డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ పోటీలను ప్రారంభించారు. టోర్నీలో రైల్వేలోని 14 జోన్ల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారని, సుమారు 121 మంది అంతర్జాతీయ బాక్సర్లు, అర్జున అవార్డు గ్రహీతలు ఉన్నారన్నారు. వాల్తేరు డివిజన్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్, ఉపాధ్యక్షులు మధుమిత సాహు, ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, స్పోర్ట్సు ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్ బి.అవినాష్, అసిస్టెంట్ స్పోర్ట్సు ఆఫీసర్ అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

తొలిరోజు ఫలితాలు: పురుషుల 51 కిలోల విభాగంలో అంకిత్ (పీఎల్‌డబ్ల్యు), కులదీప్ (ఎన్‌సీఆర్), ఆశిష్ ఇన్హా (ఎస్ఆర్), అజయ్ పెండోర్ (సీఆర్), 54 కిలోల విభాగంలో అనంత చోపడే (సీఆర్), అక్షయ్ కలోసియా (ఎన్‌డబ్ల్యుఆర్) గెలుపొందారు.

దేవదాయ శాఖ ఉప కమిషనర్‌కు సత్కారం

విశాఖపట్నం, సెప్టెంబరు 24: దేవదాయ ధర్మాదాయశాఖ జోన్ -1 ఇన్‌చార్జి ఉప కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్.సుజాతకు రెగ్యులర్ బాధ్యతలు అప్పగించడంతో అధికారులు మంగళవారం ఆమె కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. శ్రీకాకుళం జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ బలివాడ ప్రసాద్‌పట్నాయక్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు శ్యామలరావు, సర్వేశ్వరరావు, సహాయ కమిషనర్ కార్యాలయ ఉద్యోగి కోదండం, డిప్యూటీ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.మురళీమోహన్, ఈఓ శేఖరబాబు ఆమెను దుశ్శాలువతో సత్కరించారు.



సుజాతను సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

తాగునీటి సరఫరా ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు కల్పించాలి

సీతమ్మధార, సెప్టెంబరు 24: జీవీఎంసీలో తాగునీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు తమ వేతనాలు పెంచాలని కోరుతూ, సీతమ్మధారలోని సంబంధిత కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. దీంతో పాటు పలువురు కార్పొరేటర్లును కలిసి వినతి పత్రాలను సమర్పించారు. తమకు వస్తున్న రూ.13 వేలతో జీవించలేకపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్టర్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్నకార్మికులు

అక్కయ్యపాలెం: జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగంలోని అవుట్‌సోర్సింగ్ కార్మికులు సమస్యలపై 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ,44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావును వినతి పత్రమిచ్చారు. ఏఈ ఎస్‌కే రహీం, కార్మికులు సాగరమూర్తి, సింహాచలం, రాము, పైడిరాజు, శ్రీను ఉన్నారు.

క్రీడా మైదానాలు అభివృద్ధి చేయాలి: ఏయూ వీసీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 24: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని క్రీడా మైదానాలను అభివృద్ధి చేసి, విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని ఇన్‌చార్జి ఉపకులపతి, స్పోర్ట్సు బోర్డు చైర్మన్ ఆచార్య జి.శశిభూషణరావు పేర్కొన్నారు. సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన స్పోర్ట్సు బోర్డు వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏయూలో సుమారు పదివేల మంది విద్యార్థులున్నారని, క్రీడా మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మైదానాల చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. అంతర్ కళాశాలల క్రీడా పోటీలను నిర్వహించే వర్సిటీ పరిధిలోని కళాశాలలకు రూ.20 వేలు నిర్వహణ ఖర్చులు అందజేయాలని, అంతర్ వర్సిటీ టోర్నీలలో ఏయూకు ప్రాతినిథ్యం వహించే క్రీడాకారులు, కోచ్‌లకు అందించే రోజు భత్యాన్ని రూ.400కు పెంచాలని తీర్మానించారు. స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్.విజయ్‌మోహన్, వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి, సభ్యులు వెంకటేశ్వరరావు, ఎంపీ.మాణిక్యాలు పాల్గొన్నారు.

చెస్ వుమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ సాహితీకి కలెక్టర్ అభినందనలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 24: చెస్ క్రీడారంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మక వుమెన్ గ్రాండ్ మాస్టర్ టైటిల్‌కు చేరువలోనున్న వుమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ సాహితీని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అభినందించారు. పలు టోర్నీల్లో పాల్గొని పతకాలు సాధించిన సాహితీతోపాటు కోచ్‌గా వ్యవహరిస్తున్న ఆమె తండ్రి లోకేశ్ మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్‌ను కలిసి సాహితీ సాధించిన విజయాలను వివరించారు. వుమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్, వుమెన్ క్యాండిడేట్ మాస్టర్, వుమెన్ ఫిడే మాస్టర్ టైటిల్స్‌ను సొంతం చేసుకుని ప్రపంచ ర్యాపిడ్, బ్లిడ్జ్ ర్యాంకింగ్‌లో 13వ స్థానంలో ఉన్నట్టు చెప్పారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన నగదు ప్రోత్సాహక బహుమతులు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆమెను కలెక్టర్‌ను అభి నందించి, నగదు ప్రోత్సాహకాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి జూన్ గ్యాలియట్ పాల్గొన్నారు.



కలెక్టర్‌తో సాహితి, కోచ్/తండ్రి లోకేశ్, డీఎస్‌డీవో

టీడీపీ నేత అనుయాయునికే అన్న క్యాంటీన్ క్యాషియర్‌గా బాధ్యతలు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 24: గ్రేటర్ 35 వార్డు ఇందిర మునిసిపల్ స్టేడియం వద్ద అన్నక్యాంటీన్ క్యాషియర్ విధుల్లో టీడీపీ వార్డు అధ్యక్షుడు బొచ్చారామిరెడ్డికు చెందిన యువతి నియమించారు. మంగళవారం రామిరెడ్డి సిఫార్సు చేసిన ఈ యువతికే హరే కృష్ణ మూమెంట్ నిర్వాహకులు ఇవ్వాల్సి వచ్చింది. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' హరేకృష్ణ మూమెంట్ నిర్వాహకుల వద్ద ప్రస్తావించగా, టీడీపీ, జనసేన నాయకుల సిఫార్సులను అడ్డుచెప్పే ధైర్యం చేయలేకపోయామన్నారు. విధుల నుంచి తొలగించిన సంధ్యకు అక్షయ పాత్ర వంటశాలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 24: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైలు పట్టాలపై జీఆర్పీ పోలీసులు మంగళవారం గుర్తించారు. జీఆర్పీ ఎస్ఐ లక్ష్మి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి రైలు పట్టాల వద్ద ఓ వ్యక్తి గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో మృతి చెందినట్టు భావిస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని, వయసు సుమారు 45 నుంచి 50 మధ్య ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించామని, తెలిసినవారుంటే 7382058996 నంబరులో సంప్రతించాలన్నారు.

రాజేంద్రనగర్‌లో భారీ చోరీ

సీతంపేట, సెప్టెంబరు 24: సీతంపేట రాజేంద్రనగర్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు చిక్కాల సర్వ, ఈశ్వరరావు తెలిపిన వివరాలివి.. రాజేంద్రనగర్‌లో ఈశ్వరరావు నివాసం ఉంటున్నారు. ఈ నెల 23న ఉదయం 8 గంటలకు ఉద్యోగ రీత్యా బయటకు వెళ్లాడు. అతని భార్య సర్వ 12 గంటల సమయంలో కుమారుడు చదువుతున్న గీతం కాలేజీకి వెళ్లారు. ఇంట్లో ఆమె అత్తయ్య ఉన్నారు. సర్వ తిరిగి వచ్చేసరికి బీరువా తెరిచి ఉంది. అందులో ఉన్న సుమారు ఏడు తులాల బంగారం, రూ.2.8 లక్షలు చోరీ జరిగినట్టు గుర్తించి ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా దీంతో సీఐ బంగారు పాప, ఎస్ఐ రవి విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్ నమూనాలను సేకరించింది. అయితే బాధితురాలు రూ.2.8 లక్షలు, బంగారం పోయినట్టు ఫిర్యాదులో పేర్కొనగా, పోలీసులు మాత్రం రూ.50 వేలు మాత్రమే చోరీకి గురైనట్టు ఫిర్యాదులో రాయాలని ఆదేశించడం విమర్శలకు దారితీసింది.

ఏయూలో విద్యార్థుల మధ్య ఘర్షణ

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులకు, బయట విద్యార్థులకు సోమవారం రాత్రి క్యాంపస్ లోపల గొడవ జరిగింది. ఒక అమ్మాయితో ఇరువర్గాల వారు స్నేహంగా మెలగడమే గొడవకు కారణంగా భావిస్తున్నారు. దీంతో వారు రెండు వర్గాలుగా విడిపోయి బాహాబాహీకి దిగారు. దీనిని చూసిన స్థానికులు డయల్ 100కు కాల్‌చేశారు. అదే సమయంలో క్యాంపస్ హాస్టళ్లలో ర్యాగింగ్ జరిగినట్టు ఫిర్యాదు అందింది. దీంతో మంగళవారం రాత్రి పోలీసులు క్యాంపస్‌లోపల తనిఖీలుచేశారు. రెక్టార్ ఆచార్య కిశోర్‌బాబు హాస్టళ్లను పరిశీలించారు.అయితే ఇరువర్గాల మధ్య ఘర్షణకు కారణమైన విద్యార్థినిని పదిరోజులపాటు సస్పెండ్ చేసినట్టు తెలిసింది. దీనిపై అధికారులు నోరు మెదపడంలేదు.

27న కంచరపాలెంలో జాబ్‌మేళా

కంచరపాలెం, సెప్టెంబరు 24: కంచరపాలెం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈనెల 27న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు సబ్ రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి శ్యాంసుందర్ నిట్టల తెలిపారు. అపోలో ఫార్మసీ, ఇన్నోవా స్టోర్స్, డీమార్టు, తదితర సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో పూర్తిచేసిన వారు నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కాగా ఈనెల 26న ఏయూ కాన్వొకేషన్ హాల్ ఎదుట మెరైన్ గ్రౌండ్స్ వద్ద దివ్యాంగులకు జాబ్‌మేళాను నిర్వహిస్తారు.

మహా రచ్చ

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌అఫీషియో సభ్యుడు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, కుంభా రవిబాబు, పండుల రవీంద్ర బాబుతోపాటు బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జనసేనకు చెందిన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా ఇటీవల మరణించిన సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరి, పశ్చిమ బెంగాల్‌లో హత్యాచారానికి గురైన మెడికో మృతిపట్ల సంతాపం ప్రకటించారు. అనంతరం పలు అంశాలపై చర్చ సాగింది. మధ్యాహ్న భోజన విరామ అనంతరం టీడీపీ కార్పొరేటర్ ఒకరు నగరంలో పారిశుధ్య కార్మికుల జీతాల నుంచి ఆదాయ పన్ను పేరిట మినహాయించిన రెండు శాతం సొమ్మును కొంతమంది యూసీడీ అధికారులు, సిబ్బంది కలిసి పంచుకున్నారని, ఈ వ్యవహారంలో మేయర్‌కు కూడా ముడుపులు అందాయని ఆరోపించడంతో కౌన్సిల్ సమావేశంలో ఒక్కసారిగా దుమారం రేగింది.

సభను కుదిపేసిన యూసీడీ కుంభకోణం

వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి యూసీడీలో రూ.4.75 కోట్లు అవినీతి జరిగిందంటూ 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆరోపించారు. దీనికి సంబంధించి వైసీపీ కార్యాలయం పేరుతో కొంతమంది అప్పటి రాష్ట్ర మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మికి ఫిర్యాదు చేశారంటూ ఆ ప్రతిని సభలో చదివి వినిపించారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వం పసుపు కుంకుమ పేరుతో ఒక్కొక్కరికి రూ.పది వేలు చొప్పున జమ చేయగా, ఇన్‌యాక్టివ్‌గా ఉన్న 1,800 గ్రూపులతో ఆర్పీల ద్వారా కొత్తగా అకౌంట్ ఓపెన్ చేయించి రూ.95 లక్షలు యూసీడీ అధికారులు కాజేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 'ఆసరా' పథకం కింద మహిళా సంఘాలకు డబ్బులు ఇస్తే, జీవీఎంసీ పరిధిలోని 20 వేల గ్రూపుల్లో ఉన్న రెండు లక్షల మంది సభ్యుల నుంచి రూ.వంద చొప్పున రూ.20 లక్షలు యూసీడీ సిబ్బంది వసూలు చేశారని ఆరోపించారు. కొవిడ్ సమయంలో మాస్కులు కొనుగోలు పేరుతో నగరంలో లేని మహిళా ఆర్పీ ఖాతాకు రూ.ఐదు లక్షలు బదిలీ చేశారని ఆరోపించారు. వైసీపీ నేతల పిక్నిక్ పేరుతో వెయ్యి మంది ఆర్పీల నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. అలాగే మహిళా సంఘాల ఆడిట్ పేరుతో కొంత, పారిశుధ్య కార్మికుల వేతనాల నుంచి ఐటీ పేరుతో కోత పెట్టిన రెండు శాతం మొత్తం కలిపి దాదాపు రూ.4.75 కోట్లు కుంభకోణం జరిగిందని ఆరోపించడంతో సభలో కలకలం రేపింది. దీనిలో మేయర్‌తో పాటు అప్పటి కమిషనర్‌కు కూడా వాటాలు ఉన్నాయని, అందువల్లే రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించినా తొక్కిపడేశారంటూ మరో ఫిర్యాదు వెళ్లిందని రాపర్తి కన్నా ఆరోపించారు. దీంతో కూటమి సభ్యులతోపాటు సీపీఐ, సీపీఎం సభ్యులు కూడా మేయర్ రాజీనామా చేసి విచారణకు సహకరించాలని పట్టుబట్టారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది.పోడియంను సభ్యులు చుట్టుముట్టి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడంతో ఏం చేయాలో పాలుపోక మేయర్ సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించి సమావేశం నుంచి వెళ్లిపోయారు.

కూటమి వర్సెస్ వైసీపీ

... 5వ పేజీ తరువాయి

టేబుల్ ఎజెండాగా పరిగణనలోకి తీసుకోవాలని కమిషనర్ సంపత్‌కుమార్‌ను మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆదేశించారు. దీనిపై టీడీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐదేళ్ల కిందట తాము నిరాహార దీక్షలు, ధర్నాలు చేశామని, కౌన్సిల్‌లో తీర్మానం కూడా చేయాలని ప్రతిపాదిస్తే తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించామని, ఆ విషయాన్ని విస్మరించి ఇప్పుడు టీడీపీ ప్రస్తావన లేకుండా ఆయా అంశాలపై తీర్మానానికి ఎలా సిద్ధపడుతున్నారంటూ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదేళ్లపాటు స్టీల్‌ప్లాంటును కాపాడే ప్రయత్నం చేయకుండా వదిలేశారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రూ.మూడు వేల కోట్లు తెప్పించామని గుర్తుపెట్టుకోవాలన్నారు. 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోక్ మాట్లాడుతూ వైసీపీలో తాను కొంతకాలం కిందటి వరకూ కొనసాగానని దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీని పక్కనపెట్టుకున్న నాయకుడు, మాస్కులు లేవన్నాడని నడిరోడ్డుపై దళిత వైద్యుడు బట్టలు ఊడదీసి కొట్టి, చనిపోయేలా చేసిన ప్రభుత్వం...ఇవన్నీ మరిచిపోయి ఫ్లెక్సీ చిరిగితే దళితులకు అన్యాయం చేశారంటున్న కార్పొరేటర్లను చూస్తుంటే జాలేస్తోందన్నారు. వైసీపీ హయాంలో ఆరెడ్డి చెప్పారు...ఈ రెడ్డిచెప్పారంటూ తీర్మానాలను ఆమోదించేశారే గానీ...తమకు మాట్లాడే అవకాశం మాత్రం ఇవ్వలేదన్నారు. పాతజైలురోడ్డులోని ఫుడ్‌కోర్టును తొలగించాలని మేయర్‌ను డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ కోరారు. దీనిపై జనసేన ఫ్లోర్‌లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు మాట్లాడుతూ ఫుడ్‌కోర్టును తొలగించాలని ఏడాది కిందట కౌన్సిల్ తీర్మానం చేసినా వైసీపీ పాలకవర్గంలోని పెద్దలవల్లే ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. 32 దుకాణాలు ఇప్పుడు 167 కావడానికి కారణం డిప్యూటీ మేయరేనని ఆరోపించారు.

ఏపీఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్‌గా శివశంకర్

... 5వ పేజీ తరువాయి

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా విశాఖ ఉత్తర నియోజకవర్గానికి చెందిన వెంగమాంబ శ్రీనివాస్ (బీజేపీ), అంగ దుర్గాప్రశాంతి (జనసేన) నియమితులయ్యారు. ఏపీ పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా భీమిలి నియోజకవర్గ పరిధిలో మధురవాడకు చెందిన దాసరి శ్రీనివాస్ నియమితులయ్యారు. కాగా అనకాపల్లి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే, పీలా గోవింద సత్యనారాయణ కీలకమైన ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా, పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబును ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా నియమితుల య్యారు.

అప్పన్న సన్నిధిలో శాంతి హోమం

... 5వ పేజీ తరువాయి

శాంతిహోమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి ద్రవ్యాలను భక్తులతో స్పృశింపజేసిన తరువాత వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అగ్నికి సమర్పించారు. పూజలందుకున్న ప్రధాన కలశాన్ని ప్రధానార్చకులు శిరస్సున దాల్చి భక్తులతో కలిసి ఆలయ బేడామండప ప్రదక్షిణ చేసి, అంతరాలయంలో స్వామి మూల విరాట్టు చెంతన ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. పవిత్ర జలాలతో ప్రోక్షణ జరిపారు. అనంతరం యజ్ఞప్రసాదం, భస్మాన్ని భక్తులకు అందజేశారు. హోమంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పీవీజీఆర్ నాయుడు (గణబాబు), పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో మహా సంప్రోక్షణ

సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కూడా ప్రసాదాల తయారీకి నాణ్యత లేని నెయ్యి వాడినట్టు ప్రాథమికంగా నిర్ధారించిన తరుణంలో ఆ అపచార పరిహారార్థం మంగళవారం మహా సంప్రోక్షణ కావించారు. వేకువజామున సుప్రభాత సేవ తరువాత పవిత్ర గంగధార, నాగధారల నుంచి తీసుకువచ్చిన జలాలతో ఆలయాన్నంతటినీ కొత్వాల్ లంక సూరిబాబు సారథ్యంలో సిబ్బంది శుభ్రపరచారు. అనంతరం అప్పన్న సన్నిధిలో శాస్త్ర విధానంలో జరిపిన పుణ్యాహవచన పుణ్యజలాలతో ఆలయపరిసరాలు, ప్రసాదాల తయారీకి ముడి సరకులు నిల్వ ఉంచుప్రధాన స్టోర్స్ ప్రసాదాలు తయారుచేస్తున్న పొయ్యిలను ప్రోక్షణ కావించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

... 5వ పేజీ తరువాయి

ముగ్గురూ సీతంపేటలోని ప్రవీణ్ ఇంటికి బయలుదేరారు. సరిగ్గా సంజీవయ్య కాలనీ దగ్గరకి వెళ్లేసరికి వాహనం అదుపుతప్పి ప్రమాదం చోటుచేసుకుంది. ప్రవీణ్ బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ప్రశాంత్ ఇంటర్ మధ్యలో ఆపేశాడు. గాయపడిన మహేష్ పెందుర్తి సమీపంలో గల వెల్ఫేర్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుచున్నాడు.

యూసీడీ డీసీఎం నాగరాజుపై సస్పెన్షన్ వేటు

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూసీడీ విభాగంలో రూ.4.75 కోట్ల కుంభకోణం జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో ప్రధాన పాత్రధారుడిగా పేర్కొంటున్న యూసీడీ డీసీఎం వి.నాగరాజును సస్పెండ్ చేస్తూ జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. నాగరాజుపై కొంతకాలంగా వరుస ఫిర్యాదులు వస్తున్నాయని, దాంతోపాటు యూసీడీ కుంభకోణంపై రాష్ట్రప్రభుత్వానికి అందిన ఫిర్యాదు మేరకు పూర్తిస్థాయిలో విచారణ జరపాలంటూ రాష్ట్ర మెప్మా కమిషనర్ కార్యాలయంనుంచి వచ్చిన మెమోను ఫైల్ నుంచి మాయం చేశారని నాగరాజుపై ఆరోపణలు రావడంతో ఆయనపై వేటు వేశారు.

వార్డుల్లో సమస్యలపై వినతులు

మహారాణిపేట, సెప్టెంబరు 24: గ్రేటర్ 38 వ వార్డులో సమస్యలను పరిష్కరించాలనికార్పొరేటర్ గోడి విజయలక్ష్మి, టీడీపీ వార్డు ఇన్‌చార్జి నరసింహాచారి కోరారు. ఈ మేరకు కమిషనర్ పి. సంపత్‌కుమార్, మేయర్ హరి వెంకట కుమారిలకు వినతి పత్రం అందించారు. టౌన్‌హాల్‌ను గతంలో సుమారు రూ. 7 కోట్లతో పునర్నించి వృథాగా వదిలేశారన్నారు. పైపులైన్ల లీకేజీలతో కలుషితమైన తాగునీరు సరఫరా అవుతోందని చెప్పారు. లబ్ధిదారులకు హుద్‌హుద్, టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లుకేటాయించాలని కోరారు.

41 వార్డులో సమస్యలపై..

జ్ఞానాపురం: స్థానిక 41 వార్డులో సమస్యలపై కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా కమిషనర్ సంపత్ కుమార్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. వీధి దీపాల సమస్య, సుబ్బలక్ష్మీనగర్‌లో డ్రెయిన్స్‌లో పూడికలు తొలగించాలని కోరారు.

సబ్ రిజిస్ట్రార్‌గా హర్షవర్ధన్‌రెడ్డి



భీమునిపట్నం, సెప్టెంబరు 24: భీమిలి సబ్ రిజిస్ట్రార్‌గా హర్షవర్ధన్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నర్సీపట్నం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన వి.తులసీదాసు రణస్థలం బదిలీ అయ్యారు.

28వ వార్డులో స్వచ్ఛతా హీ సేవా



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో టీడీపీ నాయకులు

రామ్‌నగర్, సెప్టెంబరు 24: గ్రేటర్ 28 వ వార్డు పరిధి రామ్‌నగర్‌లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్య క్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అధికార ప్ర తినిధి నక్కా కనకరాజు ఆధ్వర్యంలో జీవీఎంసీ స చివాలయ సిబ్బందితో కలిసి బజారు కూడళ్లల్లో పలు రహదారులను శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఉరుకూటి పైడిరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేశ్ పాల్గొన్నారు.

ఘనంగా వడ్డిపోలమ్మ ఉత్సవాలు

భీమునిపట్నం, సెప్టెంబరు 24: స్థానిక వడ్డిపోలమ్మ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి తొలేళ్లతో ఉత్సవాలు ప్రారంభయ్యాయి. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మంగళవారం అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ తీర్థప్రసాదాలు పంపిణీ చేసింది.

పాఠశాలకు మొక్కలు వితరణ

భీమునిపట్నం (రూరల్): చిట్టివలస ఎస్‌బీఐ అధికారులు అప్పలరెడ్డి నాయుడు, చిట్టిబాబు మంగళవారం చిప్పాడ ఉన్నత పాఠశాలకు మొక్కలను పంపిణీ చేశా రు. పాఠశాల ఆవరణలో నాటి సంరక్షించాలని కోరారు. సరగడ సూరిబాబు కొసన చిట్టిబాబు, హెచ్‌ఎం ఎంవీటీ రత్నం, ఆర్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు

'వార్డు సమస్యలు పరిష్కరించండి'

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులోని సమస్యలపై కమిషనర్ సంపత్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో కార్పొరేటర్ కెల్ల పునీత సత్యనారాయణ వినతి పత్రాన్ని అందించారు. వీధిలైట్లు వెలిగించాలని, శివాజీనగర్ ప్రధాన గెడ్డకు రక్షణ గోడ నిర్మించాలని కోరారు. కుక్కల బెడద నియంత్రించాలని, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ రిటైనింగ్ నిర్మించాలని కోరారు. వీధుల్లో తాగునీటి సమస్యపై వినతి అందించారు.

భావోద్వేగ విద్య కీలకం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ, తదితరులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 24: శాంతియుత పౌరులుగా తీర్చిదిద్దడంలో భావోద్వేగ విద్య ముఖ్య భూమిక పోషిస్తుందని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణ రావు అన్నారు. ఆర్కిటెక్చర్ విభాగం సమావేశ మందిరంలో 'పీస్ కమ్యూనికేషన్ త్రూ ఎమోషనల్ కోషియంట్ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పౌరులను శాంతియుతంగా తీర్చిదిద్దడంలో భావోద్వేగ విద్య పాత్రను వివరించారు. అమెరికాలోని ఈక్యూ 4పీస్ సంస్థ వరల్డ్ డైరెక్టర్ ఆచార్య మాట్ పెరెల్ స్టీన్ సంక్లిష్ట సమాజానికి మార్గనిర్దేశం చేయడానికి అంతర్గత ప్రశాంతత దోహదపడుతుందన్నారు. సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ ఆధ్యాత్మిక మేదస్సు విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 53, టమాటా 46, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 30, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 26, క్యారెట్ 38, దొండకాయలు 34, బంగాళదుంపలు 30, అరటికాయ 8, మునక్కాడలు (కిలో) 84, అల్లం 85, బరబాటి 48, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 72, పొటల్స్ 44, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 54, కంద 64, దేముడు చిక్కుడు 80, కొండ ఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	98
ఫారం ధర	--	118
విత్ స్కిన్	--	206
స్కిన్‌లెస్	--	216

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10లో..



కాపులుప్పాడ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



రామాలయం వీధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న నాయకులు

ఆశీర్వదించండి.. మరిన్ని మంచి పనులు చేస్తాం

- 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, సెప్టెంబరు 24: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కాపులుప్పాడలో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిన వ్యవస్థలను గాడిలో పెడుతున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఒక్క పరిశ్రమను తీసుకురాలేదన్నారు. ఈ కార్యక్రమంలో కోరాడ రాజబాబు, డీఏఎన్ రాజు, పాసి నరసింగరావు, బోర బంగారురెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాతపరదేశిపాలెంలో గంభీరం గెడ్డపైనున్న వంతెనను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పరిశీలించారు. వర్షం కురిస్తే కాలువ పొంగి ప్రవహించడంతో పాతపరదేశిపాలెం, కాపులుప్పాడ, ఎస్సీకాలనీ, సోమన్నపాలెం, రెడ్డీలపాలెం గ్రామస్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని, నాయకులు వివరించి, గంభీరం గెడ్డ, ర్యాంప్‌ను చూపించారు. దీనిని ఎత్తు చేసి వంతెన నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని వివరించారు. ఫ్యాక్టరీల నుంచి విడిచిపెడుతున్న రసాయనాలతో పడుతున్న ఇబ్బందులను గ్రామస్థులు వివరించారు. ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోర బంగారురెడ్డి, టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షులు సూరాడ రవి తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ: గ్రేటర్ 13వ వార్డులోని పైనాపిల్‌కాలనీలో ఇది మంచి ప్రభుత్వం నిర్వహించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు పాత్రకుండ ధర్మారావు, ఎల్ల మల్లి సురేశ్, మజ్జి రమణి కరపత్రాలు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలను వివరించారు. తురకపూడి బాల స్వామి, బీజేపీ, జనసేన నాయకులుపాల్గొన్నారు.

విశాలాక్షినగర్: జీవీఎంసీ 9వ వార్డు రామాలయం వీధిలో టీడీపీ వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరించారు. వేజెళ్ల సుబ్బరాజు, శ్రీనివాసరెడ్డి, వెంకటరావు, శ్రీను, సుజాత, లక్ష్మి పాల్గొన్నారు.

కొమ్మాది: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని జనసేన 5వ వార్డు అధ్యక్షుడు దేవరశివ అన్నారు. మంగళవారం పీపీ-2కాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. జనసేన నాయకులు అప్పారావు, బత్తినశివ, సన్ని, వెంకటరమణ, శ్యామ్, సూర్యకుమారి, సంధ్య, టీడీపీ నాయకులు రమణమ్మ, ప్రసన్న, శైలజ, సౌజన్య పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ ఆరో వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అన్నారు. పి.ఎం.పాలెం కాలనీలో వందరోజుల పరిపాలనపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వదేవుళ్ల, రామకృష్ణ, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్: సమస్యలు సత్వరం పరిష్కరించనున్నట్టు టీడీపీ గ్రేటర్ 8వ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి అన్నారు. సాగర్‌నగర్ 86వ సచివాలయం ప్రాంతంలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. బి.దొరబాబు, మంగాదేవి, శ్రీనివాసరావు, సన్యాసిరావు, జగదీష్, గిరిధర్‌రెడ్డి, మూర్తి, బాలనాగమ్మ పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



పద్మనాభంలో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

పద్మనాభం, సెప్టెంబరు 24: స్థానిక కస్తూర్బా విద్యాలయంలో విశాఖపట్నం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి బాలికల క్రీడా పోటీలను ఎంపీపీ కె.రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు ప్రారంభించారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, బాల్ బ్యాడ్మింటన్ తదితర పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్-14, 17 విభాగాల్లో 12 మంది విజేతలను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రమణ, బాబూలాల్, ప్రధానోపాధ్యాయులు సన్యాసిరావు, గిరి, పీడీలు సత్యం, శేషబాబు, రవికుమార్, సూర్యనారాయణ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాధవపెద్ది సురేష్‌కు 'బాలు' పురస్కారం



సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 24: ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్‌కు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం సంగీత పురస్కారం లభించింది. పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఎస్పీ బిజమ్ పేరిట మంగళవారం యాక్మి నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి అలరించింది. గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 4వ వర్ధంతి పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆయన జ్ఞాపకాలను గుర్తుచేశారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత సురేష్ మాట్లాడుతూ సినీ సంగీత వినీలాకాశంలో బాలసుబ్రహ్మణ్యం గాత్రం చిరకాలం నిలిచిపోతుందన్నారు. అసమాన ప్రతిభాపాటవాలతో వేలాది పాటలకు ప్రాణం పోసిన గానగంధర్వుడని కొనియాడారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ సంగీత ప్రపంచంలో మకుటం లేని మహారాజు బాలు అన్నారు. ఆయన దూరమైనా పాట చిరంజీవిగా ఉంటుందన్నారు. అనంతరం స్వరాభిషేకం ఫేమ్ గాయకులు రాము, నాదప్రియ, హజ్రత్ పాడిన పాటలు రంజింపజేశాయి. కార్యక్రమంలో యాక్మి నిర్వాహకుడు ప్రతాప్, దాడి రత్నాకర్, పైడా కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూముల అవకతవకలపై విచారణ



పాండ్రంగిలో భూముల వివరాలు పరిశీలిస్తున్న ఎస్‌డీసీ సీతారామమూర్తి

పద్మనాభం, సెప్టెంబరు 24: మండలంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అవకతవకలపై మంగళవారం భూపరిరక్షణ విభాగం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ టి.సీతారామమూర్తి విచారణ జరిపారు. డి. పట్టా భూములు ఫ్రీహోల్డ్ చేయడంలో, ల్యాండ్ పూలింగ్, సర్వీసు ఇనాం భూముల్లో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన పాండ్రంగి, మద్ది, కోరాడ, కొవ్వాడ తదితర గ్రామాల్లో భూములను పరిశీలించారు. డి.ఫారం భూముల్లో 75 ఎకరాలు, ల్యాండ్ పూలింగ్‌లో 25 ఎకరాలు, సర్వీసు ఇనాంభూముల్లో 25 ఎకరాలపై అభ్యంతరాలు ఉన్న నేపథ్యంలో ఆయన సర్వేయర్ల బృందంతో కలిసి విచారణ చేపట్టారు. రైతులతో చర్చించి పలు వివరాలను సేకరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దారు ఎం.ఆనందకుమార్, ఆర్ఐ కోటి, మండల సర్వేయర్ లీల, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

'ఆటో కార్మికుల హక్కుల కల్పనలో ప్రభుత్వం విఫలం'

తగరపువలస, సెప్టెంబరు 24: ఆటో కార్మికులకు హక్కులను కల్పించడంతో ప్రభుత్వ విఫలమైందని సీఐటీయూ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ మూర్తి విమర్శించారు. మంగళవారం చిట్టివలసలోని కార్యాలయం వద్ద జరిగిన షిర్డీసాయి ఆటోస్టాండ్ ఆటో కార్మికుల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు బీమా, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. వీరికి ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించాలన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ పి.చిరంజీవిరావు మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అప్పనాయుడు, నీలాతి రాము, పల్ల పెంటరాజు, మహేశ్, జోగ వెంకటరావు, దువ్వి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న శాసనసభ్యులు

సింహాచలం, సెప్టెంబరు 24: వరాహలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, జనసేన పార్టీకి చెందిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, పశ్చిమ నియోజక వర్గ శాసనసభ్యులు గణబాబు, కార్పొరేటర్ పీవీ నరసింహం దర్శించుకున్నారు. ప్రముఖులకు ఆలయ అధికారులు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని అంతరాలయంలో వారి గోత్రనామాలతో అష్టోత్తర శతనామార్చనలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా అధికారులు శాలువతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

గాంధీజీ కల సాకారానికి కృషి



కళాకారులను సత్కరిస్తున్న ఆచార్యులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 24: గాంధీజీ కల స్వచ్ఛమైన భారతదేశాన్ని నిర్మించడమని, అందుకు జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు కృషిచేయాలని మిజోరాం యూనివర్సిటీ సోషల్ వర్క్ ప్రొఫెసర్ డాక్టర్ కొట్టు శేఖర్ అన్నారు. జాతీయ సేవా పథక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న గాంధీ- స్వచ్ఛభారత్, జాతీయ సేవా పథకం సదస్సులో ఆయన స్వచ్ఛభారత్ అద్భుత విజయాలను సాధించిందన్నారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ప్రసంగిస్తూ స్వచ్ఛత గొప్పదని గాంధీజీ అన్నారన్నారు.

కాపులుప్పాడలో 'పొలం పిలుస్తోంది' ప్రారంభం

భీమునిపట్నం, సెప్టెంబరు 24: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం కాపులుప్పాడలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా, కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం, గ్రామంలో వరి పంట క్షేత్రస్థాయి సందర్శన చేశారు. రైతులతో మాట్లాడుతూ సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుతున్నాయా.. అధికారులు తగిన సూచనలు అందిస్తున్నారా లేదా తెలుసుకున్నారు. రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, భీమిలి ఏడీఏ బి.విజయ ప్రసాద్, డీఆర్‌సీ ఏడీఏ సీహెచ్.సుబ్రహ్మణ్యం, డీపీఎం మోహన్‌రావు, ఏవోలు శివకోమలి, సంధ్యారత్నప్రభ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మద్దిలో పంటలు పరిశీలిస్తున్న ఎంపీపీ రాంబాబు, అధికారులు

రైతులకు సూచనందించాలి: ఏడీ

పద్మనాభం: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని భీమిలి డివిజన్ వ్యవసాయశాఖ ఏడీ బి.విజయప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని మద్ది, అనంతవరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సాగులో తక్కువ వ్యయంతో అధిక దిగుబడి సాధించేలా మెలకువలను రైతులకు వివరించాలన్నారు. పశువుల పెంపకం, ఉద్యాన పంటల పథకాలు, రైతుబంధు పథకంపై అవగాహన కల్పించారు. ఎంపీపీ కె.రాంబాబు ప్రారంభించిన కార్యక్రమంలో ఏఓ ఎంవీఎస్ చలం, పశువైద్యాధికారి మహేశ్, ఉద్యానాధికారి స్వాతి, మార్కెటింగ్ శాఖ అధికారి మేరికుమారి, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా

సింహాద్రినాథునికి ఘనంగా ఆర్జిత నిత్య కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, సెప్టెంబరు 24: సింహాద్రినాథునికి సిరి వైభవంగా ఆర్జిత నిత్యకల్యాణం నిర్వహించారు. దానిలో భాగంగా మంగళవారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందుని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాదన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు జరిపి మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణలు కావించి అక్షితారోపణ జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను భక్తులకు అధికారులు అందజేశారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ డే వేడుకలు



క్లీన్ అండ్ గ్రీన్ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

భీమునిపట్నం, సెప్టెంబరు 24: ప్రభుత్వ ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్‌వీ విష్ణుమూర్తి ఎన్‌ఎస్‌ఎస్ డే ఆవిర్భావం, ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరి సమాజసేవతోపాటు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం, ఎన్‌ఎస్‌ఎస్ డే ర్యాలీ నిర్వహించారు. తొలుత కళాశాల ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు ఎస్.అప్పలనాయుడు, ఎస్.శ్రీను, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేతలకు ఏయూ రిజిస్ట్రార్ అభినందన



విజేతలను అభినందిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 24: వైజాగ్ స్టార్స్ 11ఏ సైడ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా నిలిచిన ఏయూ ఉద్యోగుల జట్టును రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. మొత్తం 8 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో ఏయూ ఉద్యోగుల జట్టు ఎన్ఆర్‌కేఎఫ్‌సీ జట్టుపై 2-0తో విజయం సాధించింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీన్‌లు ఆచార్య టి.వి.కృష్ణ, టి.షారోన్‌రాజు, ఫుట్ బాల్ టీం కార్యదర్శి సిహెచ్.రమేస్, సభ్యులు పాల్గొన్నారు.

భారతీయ సంగీతం విశిష్టమైనది: ఏయూ వీసీ



సదస్సులో మాట్లాడుతున్న ఏయూ వీసీ

వెంకోజీపాలెం, సెప్టెంబరు 24: భారతీయ శాస్త్రీయ సంగీతం, కళలు విశిష్టమైనవని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు.ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు భారతీయ శాస్త్రీయ సంగీతం నృత్య శోభను మంగళవారం ప్రారంభించారు. ఏయూ సంగీత విభాగం 35వ, నృత్య విభాగం 20వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన సదస్సులో వీసీ మాట్లాడుతూ ప్రపంచ సంగీతంలో భారతీయ సంగీతం, నృత్యం ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయన్నారు. ఏయూ నాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో మెరుగైన స్థానాలను పదిలం చేసుకుందన్నారు. రానున్నకాలంలో వీటిని మెరుగుపరచుకుంటూ దేశంలోని తొలి పది విశ్వవిద్యాలయాలలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. డాక్టర్ కళ కృష్ణ మాట్లాడుతూ సంగీతం, నృత్యంతో మనిషి జన్మ ప్రారంభమవుతుందన్నారు.


అపార్టుమెంట్‌లో జీవీఎంసీ ఓపెన్‌జిమ్ పరికరాలు

- ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నక్రైం ఏడీసీపీ మోహన్‌రావు, సీఐ బంగారు పాప

పెదవాల్తేరు, సెప్టెంబరు 24: పెదవాల్తేరు విశాఖ అసుపత్రి దారిలో ఉన్న ఓషియానా అపార్ట్‌మెంటులో జీవీఎంసీ పార్కులో ఉండాల్సిన ఓపెన్ జిమ్ పరికరాలు ప్రత్యక్షమయ్యాయి. అయితే , వీటిని ఎవరు తరలించారో తెలియక అపార్ట్‌మెంట్ వాసులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన ఈ పరికరాలను ఓ ప్రైవేట్ అపార్ట్‌మెంటులో భద్రపరచడంపై పలువురు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఈ పరికరాలు పాడైతే జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం పరిధిలోని స్టోర్‌లకు తరలించాల్సి ఉంది. అలా కాకుండా దాచిపెట్టడం వెనుక ఎవరి హస్తం ఉందో తెలియాల్సి ఉంది. ఈ మేరకు అపార్టుమెంట్ వాసులు జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిమ్ పరికరాలను మంగళవారం ఉదయం జీవీఎంసీ అధికారులు వచ్చి శివాజీపార్కుకు తరలించారు. ఫిర్యాదు మేరకు క్రైం ఏడీసీపీ ఎం.మోహన్‌రావు, సీఐ బంగారు పాప దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



అపార్ట్‌మెంట్‌లో ఉన్న ఓపెన్ జిమ్ పరికరాలు



జీవీఎంసీ పరికరాలుగా ఉన్న బోర్డు